


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 199, పేజీలు - 08

గురువారం, జనవరి 1, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక HYDERABAD




# తేలేది అప్పుడే



## రేవంత్ సర్కార్ పై గ్రౌండ్ లెవెల్లో రిపోర్టు ఎలా ఉందంటే!

**హైదరాబాద్** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతుంది. అయితే ఇచ్చిన హామీలు ఎంత మేరకు అమలు చేసిందన్న దానిపై కేవలం ఉప ఎన్నికల ఫలితాల ఆధారంగా చూడలేం. ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి సాధారణ ఎన్నికల సమయానికి బయటపడుతుంది. రెండేళ్లలో సిక్స్ గ్యారంటీలను అమలు చేశామని చెప్పుకుంటున్నా ప్రజల్లో మాత్రం పెద్దగా అనుకూలత ప్రభుత్వం పట్ల లేకపోవడం విశేషం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదే పదే కాంగ్రెస్ మరో పదేళ్ల పాటు అధికారంలో ఉంటుందని చెబుతున్నారు. తానే ముఖ్యమంత్రిని అని కూడా ప్రకటించుకున్నారు. కానీ 1995 నుంచి నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ, 2014 తర్వాత విభజన జరిగిన తెలంగాణలోనూ రెండుసార్లు ఒకే ప్రభుత్వం ఏర్పాటయి ఉండి ఉండవచ్చు. మహిళలు, రైతుల్లో అసంతృప్తి ఉంది. నిరుద్యోగులు కూడా సంతృప్తిగా లేరు.

### రెండుసార్లు ఖచ్చితంగా అధికారం

కానీ ప్రజలు ఆ ప్రాతిపదికగా ఓటు వేస్తారనుకోవడం మాత్రం అనుకోవడం ఖచ్చితంగా అత్యాశే అవుతుంది. 2028 లో తెలంగాణ శాసనసభకు ఎన్నికలు జరగాల్సిన సమయంలో 2026లోకి మరికొద్ది గంటల్లో అడుగు పెట్టబోతున్నాం. అంటే చివరి ఏడాది ఎన్నికల సంవత్సరం. ఏం చేసినా రేపటి నుంచి రెండేళ్లు మాత్రమే రేవంత్ సర్కార్ కు సమయం ఉంది. ప్రజల ఆదరాభిమానాలు చూరగొనాలన్నా, వారికి దూరమవ్వాలన్నా ఈ 2026 మాత్రం కీలకం అని చెప్పాలి.

ఇప్పటి వరకూ అయితే పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ రేవంత్ రెడ్డి నాయకత్వం పట్ల పెద్దగా వ్యతిరేకత లేదు. లోపల ఉన్న ప్పటికీ నేతలు బయటపడటం లేదు. అయితే 2026 పార్టీ పరంగా కూడా రేవంత్ రెడ్డి కొన్ని ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలున్నాయన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

### మిగిలిపోయిన హామీలను..

మరొకవైపు సంక్షేమ పథకాలను వివిధ కారణాలతో అందరికీ అందించలేకపోతున్నారు. గతంలో మాదిరిగా అవినీతి ఆరోపణలు పెద్దగా వినిపించకపోయినప్పటికీ పాలనలో అసంతృప్తి మాత్రం స్పష్టంగా కనపడుతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. మరొకవైపు సెంటిమెంట్ తో ప్రత్యర్థులు ఎన్నికల బరిలోకి దిగే అవకాశముంది. ఈసారి బీసీల ఓటు బ్యాంకు ఏ పార్టీ గెలుపునకు అయినా కీలకంగా మారనుండటంతో 2026లో రేవంత్ సర్కార్ తీసుకునే ప్రతి నిర్ణయమూ ఎన్నికల ఫలితాలపై ప్రతిబింబించక మానదు. అలాగే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో మిగిలిపోయిన వాటిని కూడా ఈ ఏడాది అమలు చేయాల్సి ఉంటుంది. లేకపోతే పార్టీకి నష్టం చేకూరే అవకాశముంటుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద రేవంత్ సర్కార్ కు ఈ ఏడాది అనుకూలంగా ఉంటుందా? ప్రతికూలత పెరుగుతుందా? అన్నది తేలనుంది.

## జైశంకర్, పాకిస్థాన్ స్పీకర్ మధ్య కరచాలనం

### - ఢాకాలో అనూహ్య దృశ్యం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్, పాకిస్థాన్ మధ్య గత కొంతకాలంగా నెలకొన్న ఉద్రిక్తతల నడుమ, ఇరు దేశాల ఉన్నతాధికారులు చాలా కాలం తర్వాత ముఖాముఖిగా కలుసుకున్నారు. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ స్పీకర్ సర్దార్ అయాజ్ సాదిఖ్ బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఒకరినొకరు పలకరించుకున్నారు. గత మే నెలలో ఇరు దేశాల మధ్య సైనిక ఘర్షణ జరిగిన తర్వాత ఈ స్థాయిలో ఇద్దరు నేతలు ఎదురుపడటం ఇదే తొలిసారి కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని బేగం ఖలీదా జియా బుధవారం జరిగిన అంత్యక్రియలకు హాజరయ్యేందుకు ఇరువురు నేతలు తమ తమ దేశాల ప్రతినిధులుగా ఢాకాకు విచ్చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ కాంప్లెక్స్‌లో వీరి మధ్య కొద్దిసేపు మాటామంతీ, కరచాలనం చోటుచేసుకుంది. ఇది అధికారిక ద్వైపాక్షిక సమావేశం కాదని స్పష్టమవుతోంది.

2లో..

## 2026లో రెట్టింపు అభివృద్ధికి హామీ

### - ప్రజలకు సీఎం చంద్రబాబు నూతన సంవత్సర శుభాకాంక్షలు




అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలందరికీ 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గడిచిన 2025 సంవత్సరం కూటమి ప్రభుత్వ పాలనలో ఎన్నో మైలురాళ్లను అధిగమించిందని, రాబోయే ఏడాదిలో ప్రజలకు రెట్టింపు సంతోషం, సంక్షేమం, అభివృద్ధి అందించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. 2025 సంవత్సరం పనితీరును సమీక్షిస్తూ చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. “2025 కేవలం ఒక గడిచిన సంవత్సరం కాదు, నాటి విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్‌ను వికాసం వైపు నడిపించిన గొప్ప మలుపు” అని ఆయన అభివర్ణించారు. ఎన్నో సవాళ్లను అధిగమించి డబుల్ డిజిట్ వృద్ధి సాధించామని,

2లో..

## లోకేష్ మార్క్

### - విద్య, ఐటీ, నైపుణ్యంలో ఏపీ దూకుడు

2లో..



## జాతివివక్షను అంతం చేయాలి

### - ఎంబీఏ విద్యార్థి హత్యపై కేటీఆర్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) డెహ్రాడూన్‌లో త్రిపురకు చెందిన ఎంబీఏ విద్యార్థిని ఏంజెల్ చక్మా దారుణ హత్యపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఘాటుగా స్పందించారు. జాతివివక్ష అనేది మానవత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఘోరమైన నేరంగా అభిప్రాయపడ్డారు. ఇది భారత రాజ్యాంగ విలువలకే విఘాతమని వ్యాఖ్యానించారు. జాతివివక్ష ఏ రూపంలో ఉన్నా దానిని సహించకూడదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఏంజెల్ చక్మా దారుణ హత్యను తీవ్రంగా ఖండించిన కేటీఆర్ వివక్ష, అధికార దుర్వినియోగం కలిస్తే ఎంతటి ఘోరమైన

2లో..




## కర్నూలు, కడప మీదుగా

2లో..

## భారీ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్

### - కొత్త హైవేకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్




## ప్రతి కుటుంబం ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్ష

### - నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా పయనిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కొత్త ఏడాది ప్రతి కుటుంబం ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. 2026 సంవత్సరంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో

2లో..






కొత్త సంవత్సరం..
కొత్త ఆశలు..
సరికొత్త లక్ష్యాలు..
ఇవన్నీ కాసేపు మరిచిపోండి..
ఈ కొత్త సంవత్సరంలో వీటి గురించి ఆలోచించండి

- రోజు ఓ పది నిమిషాలు నడవండి/జాగింగ్ చేయండి
- ఓ పది నిమిషాలు నవ్వండి/నవ్వించండి
- మీ కుటుంబానికి సమయం కేటాయించండి
- తల్లిదండ్రులతో కాసేపు గడపండి
- అన్నార్తుల గురించి ఆలోచించండి.. వీలైనంత సహాయం చేయండి

అప్పుడు మనసు హాయిగా, ఆరోగ్యంగా ఉంటుంది..
జీవితం సాఫీగా, ప్రశాంతంగా సాగుతుంది..
ఆశలు, లక్ష్యాలు వాటంతటవే మీ చేతికందుతాయి..

- ఎడిటర్, ప్రజాప్రశ్న

## కిటకిటలాడుతున్న మహాజాతర

### -ముందస్తు మొక్కుల్లో మేడారం భక్తులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ములుగు జిల్లాలోని మేడారం అప్పుడే ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వచ్చే నెల (జనవరి) 28 నుంచి నాలుగు రోజుల పాటు జరిగే సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు ముందే భక్తులు మేడారానికి క్యూ కడుతున్నారు. జాతర సమయంలో ఉండే విపరీతమైన రద్దీని దృష్టిలో ఉంచుకుని, ముఖ్యంగా చిన్న పిల్లలు ఉన్నవారు, వృద్ధులు ఇప్పుడే వచ్చి వనదేవతలను దర్శించుకుంటున్నారు. మేడారానికి తరలివస్తున్న భక్తులు తమ బరువుకు తూగేలా ‘బంగారం’ (బెల్లం) తూచి గద్దెల వద్ద

2లో..

## తెలంగాణ పర్యాటక రంగానికి మహర్దశ

### - 2026లో భవిష్యత్ ప్రణాళిక ప్రకటించిన ప్రభుత్వం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దిశానిర్దేశంలో తెలంగాణ పర్యాటక రంగం అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన ప్రగతిని సాధించిందని పర్యాటక శాఖ

2లో..

పాఠకులకు, ప్రకటనకర్తలకు, జర్నలిస్టులకు శ్రేయోభిలాషులకు, మిత్రులకు, కుటుంబసభ్యులకు

ప్రజాప్రశ్న పత్రిక తరపున

2026

నూతన సంవత్సర శుభాకాంక్షలు

## జైశంకర్, పాకిస్థాన్ స్పీకర్ మధ్య కరచాలనం

బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్ కార్యాలయం వీరి భేటీకి సంబంధించిన ఫొటోలను అధికారికంగా విడుదల చేసింది. ఈ భేటీపై పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ సెక్రటేరియట్ ఒక ప్రకటన విడుదల చేసింది. జైశంకరే స్వయంగా స్పీకర్ సాదిఖ్ వద్దకు వచ్చి కరచాలనం చేసి, తనను తాను పరిచయం చేసుకున్నారని ఆ ప్రకటనలో పేర్కొంది. అయితే ఈ పలకరింపుపై భారత విదేశాంగ శాఖ నుంచి ప్రత్యేకంగా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సుమారు నాలుగు గంటల పర్యటనలో భాగంగా ఢాకాకు వచ్చిన జైశంకర్, ఖలీదా జియా కుమారుడు తారిక్ రెహమాన్‌ను కూడా కలిసి ప్రధాని మోదీ తరఫున సంతాపం తెలియజేశారు. అనంతరం ఆయన చెన్నైకి బయలుదేరి వెళ్లారు.

## 2026లో రెట్టింపు అభివృద్ధికి హామీ

పెట్టుబడిదారుల్లో విశ్వాసం పునరుద్ధరించామని తెలిపారు. గూగుల్ వంటి భారీ సంస్థల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, క్వాంటం టెక్నాలజీకి పునాదులు వేశామని పేర్కొన్నారు. అదేవిధంగా 'మొంథా' తుఫాను వంటి ప్రకృతి వైపరీత్యాలను సమర్థంగా ఎదుర్కొని ప్రజలకు సకాలంలో సహాయం అందించినట్లు గుర్తుచేశారు. ఈ విజయాల వెనుక నిబద్ధతతో పనిచేసిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారని ప్రశంసించారు. అయితే, వీటన్నింటికన్నా ప్రజలు తమపై ఉంచిన నమ్మకం, సహకారమే ఈ ప్రగతికి అసలైన చోదక శక్తి అని చంద్రబాబు అన్నారు. 2026లో పాలనలో వేగాన్ని పెంచి "హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ" లక్ష్యాన్ని చేరుకోవడంలో మరిన్ని అడుగులు వేస్తామని స్పష్టం చేశారు. ఈ స్ఫూర్తితో నూతన సంవత్సరం అందరి జీవితాల్లో కొత్త కాంతులు నింపాలని మనసారా కోరుకుంటూ, ప్రజలందరికీ హ్యాపీ న్యూ ఇయర్ చెప్పారు.

## లోకేష్ మార్క్

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో ఈ మూడు కీలక శాఖల్లో అమలు చేస్తున్న సంస్కరణలు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. ఒకవైపు విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూనే, మరోవైపు భారీ పెట్టుబడులను ఆకర్షించడం, యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు రాష్ట్ర విద్యావ్యవస్థను దేశంలోనే నెంబర్ వన్ గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మంత్రి లోకేశ్ అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఐదేళ్ల నిరీక్షణకు తెరదించుతూ, కేవలం 150 రోజుల రికార్డు సమయంలో 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీని విజయవంతంగా పూర్తిచేశారు. పైరవీలకు తావులేకుండా 'టీచర్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్' ద్వారా పారదర్శకంగా బదిలీలు చేపట్టారు. విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకు 'నో బ్యాగ్ డే', క్రీడలు, జీవన నైపుణ్యాలపై దృష్టి సారించారు. ఉపాధ్యాయులపై భారం మోపిన 45 యాప్‌లను తొలగించి, ఒకే యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న 'లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్' వంటి కార్యక్రమాలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సైతం ప్రశంసలు కురిపించారు. వీటితో పాటు, రాజకీయాలకు అతీతంగా విద్యార్థులకు 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' పేరుతో విద్యా కిట్లను అందించారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్‌లో భారీ పెట్టుబడులు ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతోంది. అమరావతిలో 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటుకు శ్రీకారం చుట్టగా, దీని కోసం క్వాంటం కంప్యూటింగ్ టాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేసింది. టీసీఎస్, కాగ్నిజెంట్, డైకిన్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాయి. ముఖ్యంగా, రూ.87,520 కోట్ల భారీ పెట్టుబడితో రైడెన్ ఇన్ఫోటెక్ (గూగుల్) డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ఏడాది జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఏకంగా రూ.1.22 లక్షల కోట్ల విలువైన 52 అవగాహన ఒప్పందాలు కుదిరాయి. దీని ద్వారా 2.32 లక్షల మందికి ఉపాధి లభించనుందని అంచనా. నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన విద్యా, ఐటీ రంగాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దేందుకు నైపుణ్యాభివృద్ధి శాఖ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ ఏడాది 4.10 లక్షల మంది యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వగా, వారిలో 1.45 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,483 జాబ్ మేళాలు నిర్వహించి 99,665 ఉద్యోగ అవకాశాలు కల్పించారు. అంతర్జాతీయంగా ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ద్వారా జర్మనీ, జపాన్ వంటి దేశాలకు నర్సులు, ఇంజనీర్లను పంపే కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయి. ఐటీఐలు, పాలిటెక్నిక్‌లను ఆధునికీకరించి పరిశ్రమలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు. అభ్యర్థుల నుంచి ఉపాధి కల్పన వరకు అన్ని సేవలను ఒకేచోట అందించేందుకు 'నైపుణ్యం' పేరుతో ఏఐ-ఆధారిత డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రభుత్వం సిద్ధం చేసింది.

## జాతివివక్షను అంతం చేయాలి

పరిణామాలు ఎదురవుతాయో అనడానికి ఈ దారుణ హత్యనే ఒక ఉదాహరణ అని అన్నారు. ఇటువంటి నేరాలు కేవలం విడిగా జరిగిన సంఘటనలు కావని ద్వేషాన్ని, వివక్షను సహించడం వల్ల కలిగే ముప్పుకు ఇవి ఒక హెచ్చరిక అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.

### భారతదేశం ఇటువంటి విషాన్ని భరించలేదు

'భారతదేశం జాతి వివక్ష, ద్వేషం వంటి విషాన్ని భరించలేదు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. 'భిన్నత్వంలో ఏకత్వం అనే పునాదిపై నిర్మించబడిన మన దేశం, ఇలాంటి విద్వేషాలను భరిస్తూ మనుగడ సాగించలేదు. న్యాయం అందించడంలో ఎటువంటి రాజీ ఉండకూడదు. జాతివివక్ష అది ప్రత్యక్షంగా ఉన్నా లేదా పరోక్షంగా ఉన్నా...దానిపై'జెరో టాలరెన్స్ ( కఠిన వైఖరి)'ని ప్రదర్శించాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంపై నైతిక మరియు రాజ్యాంగపరమైన బాధ్యత ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.

### బాధ్యత అనేది పక్షపాతంగా ఉండకూడదు

జాతి వివక్షతో కూడిన మాటలు, ప్రవర్తించిన తీరు మరియు రెచ్చగొట్టే చర్యలను తీవ్ర నేరంగా పరిగణించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ చర్యలపై కఠిన శిక్షలు అమలు చేసేలా స్పష్టమైన చట్టాలను తీసుకురావాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. జాతి వివక్ష, ద్వేషంతో కూడిన దాడులు జరిగినప్పుడు తక్షణమే అరెస్ట్ చేయడం, విచారణ వేగవంతం చేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా చట్టంలో నిబంధనలు రూపొందించాలని ఆయన కోరారు. 'చట్టం తన పని తాను చేయాలి. బాధ్యత అనేది పక్షపాతంగా ఉండకూడదు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. నొక్కి చెప్పారు.

### నేరాలు పునరావృతం కాకుండా చూడాలి

భారత రాజ్యాంగం పౌరులందరికీ సమానత్వం మరియు గౌరవం కల్పించింది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. జాతి వివక్ష నుండి పౌరులను రక్షించడం అంటే కేవలం శాంతిభద్రతల సమస్య మాత్రమే కాదని, అది దేశం యొక్క మానవ హక్కుల నిబద్ధతకు నిదర్శనమని కేటీఆర్ అన్నారు. 'వివక్షను పెంచి పోషిస్తే అది వ్యవస్థలను భ్రష్టు పట్టించి, ప్రాణాలను ప్రమాదంలో పడేస్తుంది'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం కేవలం మాటలతో సరిపెట్టకుండా ఇలాంటి విషయాలు నేరాలు మళ్లీ పునరావృతం కాకుండా కఠినమైన చట్టపరమైన రక్షణలు, పకడ్బందీ అమలు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు.

### ఎంబీఏ విద్యార్థి ఏంజెల్ చక్మా దారుణ హత్య

డెహ్రాడూన్‌లో డిసెంబర్ 9న తమ్ముడు మైఖేల్‌తో కలిసి ఎంబీఏ విద్యార్థి ఏంజెల్ చక్మా(24) షాపింగ్ చేస్తున్నాడు. అయితే స్థానిక యువకులు'చైనీస్','చింకీ','మోమో'అనే జాతి వివక్షతో కూడిన పదాలతో వారిని అవమానించారు. దీంతో ఏంజెల్ చక్మా ఆయన సోదరుడు మైఖేల్ అభ్యంతరం తెలియజేశారు. దీంతో ఆరుగురు దుండగులు కత్తి, గాజు బ్రేస్‌లెట్‌తో దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలపాలైన ఏంజెల్ చక్మాను ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో 17 రోజులు పోరాడి డిసెంబర్ 26న ప్రాణాలు వదిలాడు. ఇకపోతే ఏంజెల్ చక్మా, మైఖేల్‌ది త్రిపురగా పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు యాగ్య అవస్తి నేపాల్‌కు పారిపోయాడు. దీంతో పోలీసులు ప్రత్యేక బృందాన్ని అక్కడకు పంపి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఈ హత్యపై ఉత్తరాఖండ్ పోలీసులు స్పందించారు. ఈ హత్యలో జాతి ద్వేషం కోణం లేదని తెలియజేశారు. మరోవైపు ఈ దాడి నేపథ్యంలో బాధితుడి కుటుంబం, ఈశాన్య విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దాడిని నిరసిస్తూ త్రిపురలో నిరసనలు, కొవ్వొత్తుల ర్యాలీలు చేపట్టారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతోపాటు పలువురు ప్రముఖులు హేట్ క్రైమ్‌గా ఖండించారు. ఈ ఘటనపై ఎన్హెచ్ఆర్సీ నోటీసులు జారీ చేసింది.

## ప్రతి కుటుంబం ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్ష

తెలంగాణ వేగవంతమైన పురోగతిని సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2026 నూతన సంవత్సర వేడుకలకు హైదరాబాద్ నగరం ముస్తాబైంది. నగరంలో వివిధ ప్రాంతాల్లో కొత్త సంవత్సర వేడుకలు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి 12 గంటల వరకు వినోద కార్యక్రమాలు నిర్వహించి 2026 సంవత్సరం రాగానే పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటారు. కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్న తరుణంలో రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## కర్నూలు, కడప మీదుగా భారీ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలో మౌలిక సదుపాయాల కల్పన దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ, మహారాష్ట్రలోని నాసిక్-షోలాపూర్-అక్కల్‌కోట్ మధ్య 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. రూ.19,142 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న ఈ రహదారి, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, కడప మీదుగా చెన్నై వరకు అనుసంధానం కానుంది. 374 కిలోమీటర్ల పొడవైన ఈ యాక్సెస్-కంట్రోల్డ్ హైవే నిర్మాణం ద్వారా పశ్చిమ, తూర్పు తీరాల మధ్య రవాణా వ్యవస్థ మరింత పటిష్టం కానుంది. ఈ ప్రాజెక్టుతో సూరత్-చెన్నై మధ్య ప్రయాణ దూరం 201 కిలోమీటర్లు తగ్గనుండగా, ప్రయాణ సమయం ఏకంగా 31 గంటల నుంచి 17 గంటలకు పడిపోతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టును బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ టోల్ పద్ధతిలో అభివృద్ధి చేయనున్నారు. కేబినెట్ భేటీ అనంతరం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ, "ఈ రోజు నాసిక్-షోలాపూర్ కారిడార్ కు ఆమోదం లభించింది. ఇది అక్కల్‌కోట్ నుంచి కర్నూలు, కడప మీదుగా చెన్నై వరకు విస్తరిస్తుంది" అని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా 251 లక్షల పనిదినాలు, పరోక్షంగా 313 లక్షల పనిదినాల ఉపాధి లభిస్తుందని అంచనా. ఇదే సమావేశంలో, ఒడిశాలోని జాతీయ రహదారి-326 (మోహన-కోరాపుట్ సెక్షన్) విస్తరణకు కూడా కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.1,526.21 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా గజపతి, రాయగడ, కోరాపుట్ వంటి గిరిజన జిల్లాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ఈ పనులను ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ పద్ధతిలో 24 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ రహదారి అభివృద్ధి వల్ల మోహన, కోరాపుట్ మధ్య ప్రయాణ సమయం దాదాపు 3 గంటలు ఆదా అవుతుంది.

## కిటకిటలాడుతున్న మహాజాతర

సమర్పిస్తున్నారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లులకు ఎదురోళ్లు, యాట మొక్కులతో తమ భక్తిని చాటుకుంటున్నారు. మేడారంతో పాటు చుట్టుపక్కల 40 కిలోమీటర్ల మేర ఉండే ప్రతి చెట్టు, పుట్టను అమ్మవార్ల ప్రతిరూపంగా భావించడం ఇక్కడి విశేషం. జాతర సమయంలో అడవిలోని వన్యప్రాణులు భక్తులకు ఎలాంటి హాని చేయవనేది తరతరాలుగా వస్తున్న నమ్మకం. ఈసారి జాతరను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.251 కోట్లతో భారీ అభివృద్ధి పనులు చేపట్టింది. గద్దెల ఆధునీకరణ, విశాలమైన క్యూలైన్లు, రాతి కట్టడాలు, రహదారుల విస్తరణతో మేడారం సరికొత్తగా కనిపిస్తోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తలస్నానాల కోసం జంపన్న వాగు వద్ద కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర సమయంలో మేడారం చుట్టుపక్కల ఉన్న ఊరట్టం, కన్నెపల్లి, నార్లాపూర్ వంటి గ్రామాలన్నీ కలిసి ఒక పెద్ద పట్టణంగా మారిపోతున్నాయి. ఇప్పటికే అక్కడ హోటళ్లు, బిర్యానీ సెంటర్లు వెలిశాయి. ఎడ్లబండ్ల నుంచి హెలికాప్టర్ సేవల వరకు, సామాన్యుల వినోదం నుంచి విలాసవంతమైన వస్తువుల వరకు అన్నీ మేడారంలో అందుబాటులోకి వస్తున్నాయి.

## తెలంగాణ పర్యాటక రంగానికి మహర్దశ

బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. 2025 సంవత్సరంలో పర్యాటక శాఖ సాధించిన ప్రగతిని, 2026లో సాధించబోయే లక్ష్యాలు, భవిష్యత్ ప్రణాళికలను ఆ శాఖ అధికారులు వెల్లడించారు.

### ప్రధాన విజయాలు - 2025

ఎకో (పర్యావరణ), మెడికల్ (వైద్య), హెరిటేజ్ (వారసత్వ), స్పిరిచ్వల్ (ఆధ్యాత్మిక), రూరల్ అండ్ ట్రైబల్ (గ్రామీణ, గిరిజన), సినిమా, వెడ్డింగ్ డెస్టినేషన్, స్పోర్ట్స్ టూరిజంపై దృష్టి సారించి 'తెలంగాణ టూరిజం పాలసీ 2025-2030'ని అమలులోకి తెచ్చామని, దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధిని వివరించారు. టూరిజం కాంక్లేవ్ 2025 ద్వారా 30 ప్రాజెక్టులకు గానూ ?15,279 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగాయి, తద్వారా సుమారు 50,000 ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా మరో ?7,045 కోట్ల పెట్టుబడులు, 40,000 ఉద్యోగాల సృష్టి జరగనుంది. ముఖ్యంగా ఫుడ్‌లింక్ గ్లోబల్ సెంటర్ (?3,000 కోట్లు), సారస్ ఇన్‌ఫ్రా (?1,000 కోట్లు), స్మార్ట్ మొబిలిటీ (?1,000 కోట్లు) వంటి సంస్థలు భారీ పెట్టుబడులతో ముందుకు వచ్చాయిని పర్యాటక శాఖ అధికారులు వెల్లడించారు.

### ప్రపంచ సుందరీ వేడుకలకు వేదికగా హైదరాబాద్

పర్యాటక రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి సరికొత్త పథాన దూసుకెళ్లుతుంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 123 ప్రాజెక్టులలో ఇప్పటికే 78 ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తయ్యాయి. దీనికి అదనంగా, కేంద్ర ప్రభుత్వ పథకాలైన స్వదేశ్ దర్శన్ 2.0 మరియు ప్రసాద్ కింద రూ. 275 కోట్ల విలువైన పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అనంతగిరి కొండల్లో 'ఎకో-టూరిజం జోన్స' , భువనగిరి కోట వద్ద 'ఎక్స్‌పీరియెన్షియల్ జోన్'ను తీర్చిదిద్దుతున్నారు. అలాగే, జల పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ హుస్సేన్ సాగర్‌లో 120 మంది ప్రయాణించగల "ముచుకుంద" అనే డబుల్ డెక్కర్ బోటును పర్యాటక శాఖ అందుబాటులోకి తెచ్చింది. ప్రపంచ సుందరీ వేడుకలు హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా నిలిపడమే కాకుండా, 110 దేశాల నుండి వచ్చిన సుందరీమణులు "పర్యాటక రాయబారులుగా" మారి మన పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేశారు. ఇది హైదరాబాద్‌ను కేవలం పెట్టుబడులకే కాకుండా, వ్యాపారానికి "సురక్షితమైన, అనుకూలమైన రాష్ట్రంగా" నిరూపించిందని పర్యాటక శాఖ అధికారులు ఉద్ఘాటించారు.

### ప్రపంచ వేదికపై బతుకమ్మ

బతుకమ్మ పండుగను ప్రపంచ వేదికపై నిలబెడుతూ.. అతిపెద్ద బతుకమ్మ (19.44 మీటర్లు), 1,354 మంది మహిళలతో అతిపెద్ద జానపద నృత్యం ప్రదర్శించి సెప్టెంబర్ 29, 2025న రెండు గిన్నిస్ రికార్డులు సాధించామని సగర్వంగా ప్రకటించారు. పర్యాటకుల భద్రత కోసం 80 మంది ప్రత్యేక శిక్షణ పొందిన అధికారులతో అక్టోబర్ 13, 2025న ప్రారంభించిన "టూరిస్ట్ పోలీస్" వ్యవస్థ అద్భుతమైన ఫలితాలను ఇస్తోందన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం యూనిఫైడ్ ఆన్‌లైన్ పోర్టల్, డిజిటల్ ట్రావెల్ కార్డులు వంటి వినూత్న సేవలకు శ్రీకారం చుట్టినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.

### 2026 లక్ష్యాలు

- రాబోయే 2026 సంవత్సరానికి గానూ పర్యాటక శాఖ స్పష్టమైన ప్రణాళిక వివరాలను ప్రకటించింది:
- హైదరాబాద్ - సోమశిల - శ్రీశైలం సర్క్యూట్‌లో హెలీ టూరిజం సేవలను పూర్తిస్థాయిలో హెలీ టూరిజం అందుబాటులోకి తేవడం.
- నాగార్జున సాగర్, సోమశిల, బస్వాపూర్ వంటి ప్రాంతాలను అత్యుత్తమ వెడ్డింగ్ డెస్టినేషన్లుగా అభివృద్ధి చేయడం.
- నాగార్జున సాగర్, బస్వాపూర్, సోమశిలలో కొత్త వెడ్డింగ్ డెస్టినేషన్ల అభివృద్ధి
- మెడికల్ టూరిజం సొసైటీని స్థాపించి, హైదరాబాద్‌ను గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడం.
- జనవరి 13, 14, 15న ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ షోలను నిర్వహించడం. 19 దేశాల నుండి 40 మంది అంతర్జాతీయ, 55 మంది జాతీయ కైట్ ప్లయర్స్ భాగస్వాములు కానున్నారు.
- హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ 2026: జనవరి 16-18 వరకు ఐరోపా దేశాలకు నుంచి వచ్చే ప్రతినిధులతో అంతర్జాతీయ స్థాయి 15 బెలూన్లతో ప్రదర్శన.
- డ్రోన్ షో 2026: గచ్చిబౌలి స్టేడియంలో జనవరి 13, 14న హైటెక్ డ్రోన్లతో వినూత్న ప్రదర్శన
- జాతీయ- అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ పై ప్రత్యేక దృష్టి.

తెలంగాణ పర్యాటక రంగం కేవలం వినోదానికే పరిమితం కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా, స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించే వనరుగా మారుతోందని ఆశాఖ అధికారులు స్పష్టం చేశారు.

## తాళం వేసిన ఇళ్లపై దొంగల గాలం

దేవరకద్ర, : మద్దూరు, తాళాలు వేసిన, గ్రామ చివరలో, ఒంటరి వ్యక్తులు ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారు. నెల రోజులుగా చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో రాత్రి 9 గంటలు గడిస్తే ఒక్కరు కూడా ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. ఇదే అదునుగా భావించిన కొందరు చోరీలకు ఉపక్రమిస్తున్నారు. వరుస దొంగతనాలతో ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నారు. నలుగురు, ఐదుగురు ప్రైవేటు వాహనాల్లో అర్ధరాత్రి తాళాలు ఉన్న ఇళ్లలో చొరబడుతున్నారు. ఈ క్రమంలో వారంతా పక్కాగా రెక్కీ నిర్వహిస్తున్నట్లు సమాచారం. మద్దూరు మండలం నాగిరెడ్డిపల్లిలో ఇటీవల తాళం ఉన్న ఆరు ఇళ్లలో చొరబడి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. మద్దూరు పట్టణంలో ఓ వ్యక్తి ముసుగు ధరించి ఇంట్లో దొంగతనానికి పాల్పడే ప్రయత్నం చేయగా సీసీ టీవీలో రికార్డు అయింది. ఇంటి యజమాని నిద్రలేవటంతో పారిపోయాడు.

## తాత్కాలిక ఆనందానికి విలువైన జీవితం నాశనం చేసుకోవద్దు

నిజామాబాద్ రూరల్, : నూతన సంవత్సరం వేడుకలను ఆనందంగా, చట్టానికి లోబడి జరుపుకోవాలని కామారెడ్డి పట్టణ ప్రజలకు టౌన్ సీఐ నరహరి సూచించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, డిసెంబర్ 31న డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తామని, మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకల పేరుతో డీజేలు, అధిక శబ్దం వచ్చే సౌండ్ బాక్సులు వినియోగిస్తూ ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## జర్నలిస్టుల బస్ పాస్ సమస్యలను పరిష్కరించాలి



ఆర్మూర్, కామారెడ్డి డిపో మేనేజర్ దినేష్ కు బుధవారం టీయుడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు తమ ఆర్టీసీ బస్సు పాసుల జారీలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. జిల్లా యూనియన్ అధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ, డిపోలో పాసుల ప్రింట్ సరిగ్గా రావడం లేదని, దీంతో ప్రయాణంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పాసులను లామినేషన్ చేసి ఇవ్వాలని, అలాగే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉచిత ప్రయాణ సౌకర్యం ఉన్న కొందరు సిబ్బంది 35 కిలోమీటర్ల వరకే ఇస్తామంటూ ఇబ్బందులు పెడుతున్నారని ఆయన ఆరోపించారు. వెంటనే జర్నలిస్టుల బస్ పాస్ సమస్యలను పరిష్కరించాలని డిఎం ను కోరారు.

## భగవంతుని ఎదుట అందరు సమానులే ఎమ్మెల్యే కేవి. రమణ రెడ్డి

బాల్కొండ, : కామారెడ్డి ఎమ్మెల్యే కేవీ రమణారెడ్డి బుధవారం కామారెడ్డిలోని అయ్యప్ప ఆలయంలో జరిగిన తృతీయ పుష్కర మహా కుంభాభిషేకము, శతచండీ హోమము, సహస్ర కళశాభిషేకము, విశేష వాహన సేవల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భగవంతుని ఎదుట అందరూ సమానులేనని, చిన్న, పెద్ద అనే తేడా ఉండదని అన్నారు. అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. తాను మూడుసార్లు అయ్యప్ప మాల ధరించానని, ఆ అనుభూతి గొప్పదని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన నాపరాయి వ్యాపారుల సంక్షేమ సంఘం



తాండూరు, : నాపరాయి రంగం ప్రగతి, కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలంటూ అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని తాండూరు మండల నాపరాయి వ్యాపారుల సంక్షేమ సంఘాలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపాయి. బుధవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. నాపరాయి రంగంపై 30 వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తాండూరు నాపరాయిని ఉపయోగించేలా ప్రభుత్వంతో జీవో జారీ చేయించాలని వారు కోరారు. వారి వెంట సంఘాల ప్రతినిధులు అబ్దుల్ రవూఫ్, అప్పు(నయీమ్), జుబైర్ లాలా, హబీబ్ లాలా, హర్షవర్ధన్ రెడ్డి, నారాయణ తదితరులు ఉన్నారు.

## మద్యం తాగి పట్టుబడితే భారీ జరిమానా..

నాంపల్లి, : న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో మందుబాబులకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరికలు జారీ చేశారు. నూతన సంవత్సరం బందోబస్తు ఏర్పాట్లపై సీపీ సజ్జనార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లపై కీలక ఆదేశాలను జారీ చేశారు. మద్యం తాగి వాహనాలతో రోడ్ల పైకి వస్తే ఉపేక్షించేది లేదన్నారు. నగరంలోని 120 ప్రాంతాల్లో ఇవాళ రాత్రి ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని చెప్పారు. మద్యం తాగి పట్టుబడితే భారీ జరిమానాతో పాటు వాహనాలను జప్తు చేస్తామన్నారు. జైలు శిక్ష, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు తదితర చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ర్యాష్ డ్రైవింగ్, బహిరంగ ప్రదేశాల్లో న్యూసెన్స్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

## జపాన్‌లో భూకంపం

### - కొత్త సంవత్సరాది వేళ కలవరం



**టోక్యో (ప్రశ్న న్యూస్)** నూతన సంవత్సరం వేళ జపాన్‌లో భూకంపం సంభవించింది. తూర్పు నోడా నగరంలో రిక్టర్ స్కేలుపై 6 తీవ్రతతో భూమి కంపించింది. నోడాకు తూర్పున 91 కిలోమీటర్ల దూరంలో, 19.3 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు అమెరికా జియాలాజికల్ సర్వే వెల్లడించింది. ఈ భూకంపం కారణంగా జరిగిన ఆస్తి నష్టం, ప్రాణ నష్టం గురించిన వివరాలు తెలియాల్సి ఉంది. ఈ నెల 8వ తేదీన జపాన్ తూర్పు తీరంలో 7.5 తీవ్రతతో భూకంపం వచ్చిన విషయం విదితమే. ఆ సమయంలో పలు ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం డిసెంబర్ 12న 6.7 తీవ్రతతో మరోసారి భూమి కంపించింది.

# ఎంఎంటీఎస్‌లో ప్రయాణికురాలిపై దాడి

సికింద్రాబాద్, : ఎంఎంటీఎస్ రైలులో ప్రయాణిస్తున్న ఓ మహిళ బంగారు గొలుసు, హ్యాండ్‌బ్యాగు లాక్కుని ఓఆగంతకుడు పరారయ్యాడు. జీఆర్పీ పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలో మాధవపురి హిల్స్‌లో నివాసముంటున్న నాగపల్లవి కుటుంబసభ్యులతో యలహంక జంక్షన్‌నుంచి రైలులో కాచిగూడకు చేరుకున్నారు. అక్కడినుంచి చందానగర్‌కు వెళ్లేందుకు ఎంఎంటీఎస్ రైలులో మహిళల బోగీలో ఎక్కారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని 10వ నంబరు ప్లాట్‌ఫాం నుంచి రైలు బయలుదేరిన సమయంలో బోగీలోకి ఎక్కిన ఓవ్యక్తి ఆమె మెడలోని 3తులాల బంగారు గొలుసును లాక్కునేందుకు ప్రయత్నించాడు. ప్రతిఘటించడంతో చంపేస్తానని బెదిరించి గొలుసుతో ఉడాయించాడు.

# బాలుడిపై హత్యాచారం..

## నిందితునికి జీవిత ఖైదు

వికారాబాద్, : బాలుడిపై అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన నిందితునికి రాజేంద్రనగర్ ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. మొయినాబాద్ మండలం చిలుకూరులోని జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహసముదాయంలో ఉండే బాలుడు(9)ను మహబూబ్‌నగర్ జిల్లా దామరగిద్ద మండలం శాంతినగర్‌కు చెందిన చీరల వ్యాపారి వడ్ల సంతోష్.. 2016లో కిడ్నాప్ చేశాడు. బాలుడిపై లైంగిక దాడికి పాల్పడి.. హత్య చేశాడు. కేసు నమోదు చేసిన అప్పటి ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసు.. సంతోష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి.. తీర్పు వెలువరించారు. నిందితునికి రూ.21 వేల జరిమానాతో పాటు జీవిత ఖైదు విధించారు. ఇక బాలుని కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన

# టిడిపి నాయకులు



**బేతంచెర్ల,** బేతంచెర్ల మండలంలోని బలపాలపల్లె గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ ను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డిసెంబర్ 31వ తేదీ నా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పోలూరు శ్రీనివాస్ రెడ్డి , కొలుములపల్లె గ్రామ వార్డు సచివాలయం వీఆర్వో రాంగోపాల్,ఇంజనీరింగ్ అసిస్టెంట్ సురేష్,విలేజ్ సర్వేయర్ మంజునాథ్,వెల్ఫేర్ అసిస్టెంట్ బాలసుబ్రమణ్యం, వెటర్నరీ డాక్టర్ వినయ్ లు ఈ కార్యక్రమంలో పాల్గొని పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేసి,ప్రజలతో మమేకమయ్యారు. అనంతరం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పోలూరు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పెన్షన్ దారులందరికీ ముందుగా 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు ఎన్టీఆర్ భరోసా పథకం వల్ల వృద్ధులు, వికలాంగులు,నిరుపేదలు ఆర్థికంగా కొంత ఊరట పొందుతున్నారని వారు తెలిపారు. ప్రతి పింఛన్ మీ భరోసా,ప్రతి రూపాయి మీ అండ,అని మన ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి గారు తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఇంటికి చేరవేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని,ప్రజల సమస్యలు తీర్చడంలో ఎప్పుడూ ముందుంటామని వారు స్పష్టం చేశారు.ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో బలపాలపల్లె గ్రామంలోని 227 బూత్ ఇన్చార్జి రాచపోగుల ఈశ్వరయ్య,226 బూత్ కో కన్వీనర్ మంత్రి గురునాథ్, తెలుగుదేశం పార్టీ నాయకులు మంత్రి కోటేశ్వరయ్య,టి.మద్దిలేటి, ముద్దవరం శేఖర్,రాసిపోగుల శివన్నతలారి పుల్లయ్య లు ఈ కార్యక్రమంలో ఉన్నారు.

## ఆళ్లగడ్డ నాలుగు రోడ్ల కుడలిలో

# మైనార్టీల హక్కుల కోసం మౌన దీక్ష




**ఆళ్లగడ్డ** ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఈరోజు ప్రపంచవ్యాప్తంగా మైనారిటీలపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఆళ్లగడ్డ నాలుగు రోడ్ల కుడలిలో జేఏసీ కమిటీ కన్వీనర్ బీరువాల భాష మాట్లాడుతూ వారితోపాటు సామాజిక, రాజకీయ, సంఘాలా ఆధ్వర్యంలోనాలుగు రోడ్ల కుడలిలో మౌన దీక్ష నిర్వహించారు.భారత్,బంగ్లాదేశ్లలో మైనార్టీలపై హింసను ఖండిస్తూ, న్యాయవ్యవస్థలో సంస్కరణలు, మైనార్టీల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని,రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శాంతి సమాన హక్కుల కోసం ఐక్యంగా పోరాడుతామని ప్రజా సంఘాలు కులసంఘాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకుడు జిల్లా ఇన్చార్జి చంద్రశేఖర్,నంద్యాల జిల్లా జనరల్ సెక్రెటరీ ఎర్రమల చక్రవర్తి, మండల ఉపాధ్యక్షుడు బద్రి ప్రసాద్, ఎస్.డి. పి.ఐ పార్టీ నాయకుడు ఫక్రుద్దీన్, సిరివెళ్ల జేఏసీ నాయకుడు నిజాముద్దీన్, నూర్ భాషా, ఆళ్లగడ్డ జేఏసీ నాయకుడు బైక్ మెకానిక్ నూర్ భాషా, దస్తగిరి ఆళ్లగడ్డ కన్వీనర్ మూల ప్రభాకర్ వీరితోపాటు అధిక సంఖ్యలో మహిళలు కూడా పాల్గొన్నారు.

## వైకుంఠ ద్వాదశి సందర్భంగా

# శాస్త్రోక్తంగా చక్రస్నానం



**తిరుమల,** వైకుంఠ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమలలో బుధవారం తెల్లవారుజామున స్వామివారి పుష్కరిణి తీర్థ ముక్కోటి నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్ ను స్వామి పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి చక్రస్నానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# కండక్టర్ ఎన్ వి రాంకుమార్ కు

# ఘనంగా పదవి విరమణ వీడ్కోలు

### తెలంగాణ ఆర్టీసీ కండక్టర్ ఐక్యవేదిక అధ్యక్షులు

### తెలంగాణ ఆర్టీసీ సీసీ ఎస్ డెలిగేట్




హైదరాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణ ఆర్టీసీ విభాగ కుటుంబం లో ఉదయం కోడి కూయకముందే, ఆర్టీసీ కార్మికులు నిద్రలేవక ముందే వారు తమ మొబైల్స్ తెరిచినప్పుడు, వారికి కనిపించే ఆర్టీసీవార్తలను గత కొన్ని సంవత్సరాలుగా, ఆర్టీసీ కార్మికులందరి కోసం కష్టపడి పనిచేస్తూ, ప్రతిరోజూ తెల్లవారుజామున 3 గంటలకే నిద్రలేచి, వివిధ వార్తాపత్రికల ద్వారా మన టీజీ ఎస్సార్టీసీ, ఇతర రాష్ట్ర ఆర్టీసీల గురించిన తాజా వార్తలు, ఇతర ముఖ్య సమాచారాల్ని ఓపికగా సేకరించి మనకు అందిస్తున్న కుషాయిగూడ డిపోకు చెందిన "అరుదైన" ఆర్టీసీ కండక్టర్ తెలంగాణా కండక్టర్ ఐక్యవేదిక ప్రెసిడెంట్, సి సి ఎస్ డెలిగేట్ అయినా ఎన్.వి. రామ్ కుమార్. డిసెంబర్ 31న ఆయన పదవీ విరమణ సందరరేగా ఘనంగా వీడ్కోలు సమావేశం కుషాయిగూడ డిపో ప్రాంగణంలో ఏర్పాటు చేసారు. అయన గత జీవిత చరిత్ర లోకి వెళ్తే తల్లిదండ్రులు కీ.శే. నరసింహాచార్యులు,పద్మావతి కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు అందరిలో చివరి కుమారుడు అయినా రామ్ కుమార్ హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో ఉన్న ఎస్.వి.ఇ.ఎస్ పాఠశాలలో 10వ తరగతి వరకు ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత, కాచిగూడ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, బద్రుకా కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. నాగార్జున విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ. (సైకాలజీ)లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, ఏపీ ఓయూ ద్వారా పబ్లిక్ రిలేషన్స్, మానవ హక్కుల కోర్సులను పూర్తి చేసి వాటిలో ప్రావీణ్యం సంపాదించారు. తన గురువుల అడుగుజాడల్లో నడుస్తూ, విషయ పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ సమాజానికి తన వంతు సేవ చేశారు.ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో లెక్చరర్‌గా స్థిరపడాలని కోరుకున్నప్పటికీ 1986లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో కండక్టర్‌గా చేరి, 1998లో రెగ్యులరైజ్ అయ్యారు. అప్పటి నుండి నేటి వరకు కుషాయిగూడ డిపోలో తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ, తనదైన చెరగని ముద్ర వేశారు. కండక్టర్‌గా తన వ ృత్తిని కొనసాగిస్తూనే ఇతరులకు మార్గదర్శకుడిగా నిలిచారు.నీరజ తో 1994 ఫిబ్రవరి 27న వివాహం జరిగింది.తనకి ఇద్దరు సంతానం బాబు పేరు. కౌశిక్,అమెజాన్ కంపెనీలో చేస్తున్నాడు చదువు బి టెక్‌పాప సుమేధ.ఎంబి ఏ చేసింది.డెలైట్ కంపెనీలో చేస్తుంది.సహజంగానే ఇంద్రజాలికుడైన రామ్ కుమార్ తనవంతు ప్రయత్నంగా మానసిక వికలాంగులకు ఇంద్రజాల శిక్షణ ఇచ్చి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి వారిచే ప్రదర్శలిప్పించడం వారి ప్రతిభకు నిదర్శనం.ఇది తనకి మర్చిపోలేని ఘటనని దీనికి సహకరించిన ఆంధ్ర మహిళా సభ(దుర్గాబాయి హాస్పిటల్)వారికి ప్రత్యేక ధన్యవాదాలు అని రామ్ కుమార్ అంటుంటారుఆర్టీసీ లో అనారోగ్యం/హతాత్మరణం/ లేదా ఇతర సమస్యల వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాల పిల్లలను ఆర్థికంగా అదుకోవడంకోసం విరాళాల సేకరణ చేసి వారికి సహాయం చేయడం అనేవి కూడా మర్చిపోలేని ఘటనఅని పేర్కొంటారు.ఆర్టీసీ తరపున నిర్వహించే కార్యక్రమాలలో అనేక ఇంద్రజాలప్రదర్శనలు,బ్లైండ్ ఫోల్డ్(కళ్ళకు గంతలు కట్టుకుని స్కూటర్ నడపడం) వంటి కార్యక్రమాలు అనేకం చేశారు. నటుడు క ృష? గారి వీరాభిమాని, ఆయన యొక్క కార్యక్రమాలలో పాల్గొనడం, విరాభిమానుల కి కోసం పాటలు సేకరించి అందివ్వడం, మరియు సిసి ఎస్ డెలిగేట్ గా భాధ్యతలు నిర్వహించి సభ్యత్వ నమోదు లో రికార్డు స ృష్టించారు.ఆర్టీసీ ఉద్యోగుల కు ఉద్యోగ భద్రత కోసం తన వంతు గా వివిధ కార్యక్రమలు, రాష్ట్ర నలుమూలల తిరిగి కండక్టర్ ఐక్యవేదిక " అధ్యక్షుడుగా "తన వంతు పాత్ర పోషించిన రామ్ కుమార్ కి ఈరోజు ఘనంగా వీడ్కోలు సన్మానం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో డిపో మేనేజర్.. శ్రీ వేణు గోపాల్ అసిస్టెంట్ మేనేజర్( ట్రాఫిక్) చంద్రమౌళి అసిస్టెంట్ ఇంజనీర్ ( మెకానిక్) వ్యాస్ మరియు కండక్టర్ ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ కి గౌరవ సలహాదారులు అయినా పగడాల సుదర్శన్ ( డిప్యూటీ సూపరింటెండెంట్ ) వీరాంజనేయులు ( సీనియర్ అసిస్టెంట్ ) మరియు కమిటీ సభ్యులు కే ఆర్ కుమార్, సంతోష్, రంజిత్, మొహమ్మద్ మోసిన్, ఆనంద్, జీవన్, రవి, యాదయ్య, తేజవతి, వినోద,శ్రవణ్ వివిధ డిపో మిత్రులు, కుషాయిగూడ డిపో కండక్టర్, డ్రైవర్, గ్యారేజ్ సిబ్బంది, ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యువనేత లోకేష్ సారథ్యంలో

# విప్లవాత్మక సంస్కరణలు

**ఏపీలో విద్యావ్యవస్థను నెం.1గా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**మెగా డీఎస్సీ నుంచి టీచర్ ట్రాన్స్ ఫర్ యాక్ట్ వరకూ.**

**పైరవీలకు తావులేకుండా పారదర్శక విధానాల అమలు**

**రాష్ట్రంలో విద్యాసంస్కరణలపై కేంద్రమంత్రి ప్రశంస**



అమరావతి(ప్రశ్న న్యూస్) రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సారథ్యంలో ఈ ఏడాది విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారు. సంస్కరణల ఫలితంగా ప్రభుత్వ విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెరిగాయి. అంతర్జాతీయంగా విద్యారంగంలో వస్తున్న మార్పులకు ధీటుగా ఏపీలో విద్యావ్యవస్థను తయారు చేయాలన్న ధ్యేయంతో ముందుకు సాగుతున్నారు. విద్యారంగ సంస్కరణల ద్వారా గుణాత్మక విద్యకు శ్రీకారం చుట్టారు. ఏపీ విద్యావ్యవస్థను దేశంలోనే నెం.1గా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో యువమంత్రి లోకేష్ ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా ఐదేళ్ల తర్వాత తొలిసారిగా మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించి 16,347 టీచర్ పోస్టులను భర్తీచేశారు. కొందరు రాజకీయ ప్రత్యర్థులు కుట్రతో 200కు పైగా కేసులు వేసినప్పటికీ వాటన్నింటినీ చాకచక్యంగా పరిష్కరించి, కేవలం 150రోజుల వ్యవధిలో డీఎస్సీని విజయవంతంగా నిర్వహించి రికార్డు స ృష్టించారు. టీచర్ ట్రాన్స్ ఫర్ యాక్ట్ ద్వారా ఎటువంటి రాజకీయ ప్రమేయం లేకుండా పారదర్శకంగా ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టారు. దీనివల్ల ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో టీచర్ల బదిలీలకు చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటైంది. వెబ్-ఆధారిత కౌన్సిలింగ్ ద్వారా గతంలో మాన్యువల్ విధానంలో సమస్యలకు చరమగీతం పాడారు. వివిధ కేడర్ లలో 4వేల మందికి పైగా ఉపాధ్యాయులకు ప్రమోషన్లు సైతం లభించాయి. దేశంలోనే తొలిసారిగా కడప జిల్లాలో సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ విధానాన్ని అమలు చేస్తున్నారు.

విద్యార్థుల్లో మానసిక వికాసం కోసం ప్రతి శనివారాన్ని నో బ్యాగ్ డేగా ప్రకటించారు. దీనిద్వారా సహ-పాఠ్య, సమ ృద్ధి కార్యక్రమాలు, క్రీడలు, ద ృశ్య-ప్రదర్శన కళలు, జీవన నైపుణ్యాల ఆధారిత శిక్షణ ఇస్తూ విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు శిరోభారంగా పరిణమించిన సుమారు 45 యాప్ ల భారాన్ని తగ్గించి, కేవలం ఒకే యాప్ కిందకు తెచ్చారు. సింగిల్ ఇంటర్ ఫేస్ ద్వారా ప్రతివిద్యార్థి పనితీరుకు సంబంధించిన డేటాను రియల్ టైమ్ క్లాస్ రూమ్ తల్లిదండ్రుల భాగస్వామ్యంతో అనుసంధానించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ ఏడాది క్రీమ్ & ఆలివ్-గ్రీన్ యూనిఫామ్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రాజకీయరహిత, పార్టీరహిత, నిష్పక్షపాత రంగులతో అత్యంత ఆకర్షణీయంగా ఈ యూనిఫాంను డిజైన్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా NCERT-అనుగుణ కరిక్యులమ్ కు రూపకల్పన చేశారు. పాఠశాల విద్యలో ఫౌండేషన్ లిటరసీ-న్యూమరసీ (FLN), డిజిటల్ లిటరసీ, సామర్థ్య-ఆధారిత బోధనను మరింత విస్త ృత పర్చడానికి వీలుగా . క్యూఆర్ కోడ్ కంటెంట్ తో బైలింగ్వువల్ సిలబస్‌ను తీసుకువచ్చారు. ఏఐ ఆధారిత ఎసెస్ మెంట్, డిజిటల్ లెర్నింగ్, ప్లేబేస్డ్, సామర్థ్య కేంద్రీక ృత విధానాల సమ్మిళితంతో లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (LEAP) పేరిట సమగ్ర సంస్కరణ మోడల్ విద్యకు శ్రీకారం చుట్టారు. ఈ విధానంతో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్ కు ధీటుగా తీర్చిదిద్దనున్నారు. లీప్ కార్యక్రమం కింద ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 175 స్కూళ్లను అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో అభివ ృద్ధి చేయనున్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నిడమర్రు జడ్పీ ఉన్నత పాఠశాలను ఎంపిక చేశారు. విద్యా ప్రమాణాల మెరుగుదలకు 9,600 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటుచేసి ఒకే తరగతి, ఒకే టీచర్ విధానాన్ని ప్రవేశపెట్టారు. రాజకీయ నేతల పేర్లు, బొమ్మలకు ఆస్కారం లేకుండా 2025-26 విద్యాసంవత్సరంలో సర్వేపల్లి రాధాక ృష? విద్యార్థి మిత్ర విద్యా కిట్లు & అసెస్‌మెంట్ పుస్తకాలను రాష్ట్రవ్యాప్తంగా 35.94లక్షల మందికి అందజేశారు. ఫార్మేటివ్/ సమ్మేటివ్ అసెస్‌మెంట్లను క్రోడీకరించి, డాక్యుమెంట్ చేయడానికి వీలుగా అసెస్‌మెంట్ బుక్‌లెట్లను అందించారు. రాష్ట్రంలో నూరుశాతం అక్షరాస్యత సాధనే లక్ష్యంగా మిషన్ "అక్షర ఆంధ్ర" ప్రకటించారు. అన్ని గ్రూపుల వయోజనులను అక్షరాస్యులుగా మార్చే లక్ష్యంతో స్టేట్ లిటరసీ మిషన్ ను బలోపేతం చేశారు. యోగవిద్యపై విద్యార్థుల్లో చైతన్యాన్ని నింపేందుకు యోగాంధ్ర - 2025 పేరిట రాష్ట్రవ్యాప్త పాఠశాల-సంబంధిత యోగా కార్యక్రమాన్ని చేపట్టారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందరరేగా జూన్ 21 నుంచి జూలై 2025 వరకు నెలరోజులపాటు చేపట్టిన ఈ కార్యక్రమంలో లక్షలాది విద్యార్థులు, ఉపాధ్యాయులు సమకాలీన యోగా అభ్యాసకులు భాగస్వాములయ్యారు. ఈ ఏడాది జులై, డిసెంబర్ నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్ -టీచర్ మీటింగ్ (మెగా పిటిఎం)ను విజయవంతంగా నిర్వహించారు. 61వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఒకేసారి ఈ కార్యక్రమాన్ని చేపట్టగా, 53.4 లక్షలకు పైగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భాగస్వాములయ్యారు. జులై 10న నిర్వహించిన మెగా పిటిఎంలో మొత్తంగా 1.5 కోట్లు (15 మిలియన్లు) మించిందని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ధ ృవీకరించింది. విద్యార్థుల్లో పర్యావరణపై అవగాహన కోసం గ్రీన్ పాస్ పోర్టును ప్రవేశపెట్టారు. ఎకో-సిటిజన్‌షిప్, చెట్లు నాటడం, సస్టైనబిలిటీ పద్ధతులను పెంపొందించడం ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశం. అత్యున్నత ప్రమాణాలతో పారదర్శకంగా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికను చేపట్టారు. ఏటా ఉపాధ్యాయుల దినోత్సవం రోజున వారిని ఘనంగా సత్కరిస్తున్నారు. రాష్ట్రంలోని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను అధునాతన విద్యావిధానాలపై అధ్యయనం కోసం విదేశాలకు పంపిస్తున్నారు. అక్కడి బోధనా పద్ధతులు, తరగతి గదుల్లో వినియోగిస్తున్న ఆధునిక సాంకేతికత, పాఠశాల వాతావరణం వంటి అంశాలపై వారు సమగ్రంగా అధ్యయనం చేయనున్నారు.రాష్ట్రప్రభుత్వం, సైయెంట్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో విశాఖపట్నం జిల్లాలోని 50 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు రూ.8కోట్ల వ్యయంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, STEM, రోబోటిక్స్ ల్యాబ్‌లను ఏర్పాటుచేశారు. మధ్యస్థ & ఉన్నత పాఠశాల విద్యార్థులకు హ్యాండ్స్-ఆన్ టెక్నాలజీ విద్య, కోడింగ్ లిటరసీ, ఇన్‌క్వైరీ-ఆధారిత లెర్నింగ్‌ను బలోపేతం చేయడానికి ఈ ల్యాబ్‌లు ఏర్పాటుచేశారు. ఏపీ టెట్ నిర్వహణ కోసం అక్టోబర్ -2025 నోటిఫికేషన్ ప్రకటించారు. ఉపాధ్యాయ అర్హత & సర్టిఫికేషన్ టెస్టింగ్ కోసం ఆన్‌లైన్ అప్లికేషన్ విండో (అక్టోబర్ చివరి నుంచి) ఓపెన్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీలను అంచనా వేయడానికి ఈ ఏడాది నవంబర్ 24నుంచి డిసెంబర్ 6వరకు 14లక్షలమంది ప్రాథమిక విద్యార్థులను కవర్ చేస్తూ ఎఫ్ఎల్ఎన్ బేస్ లైన్ సర్వే నిర్వహించారు. బేస్ లైన్ సర్వే ఆధారంగా ఎఫ్ఎల్ఎన్ పై రాష్ట్రవ్యాప్తంగా క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. ప్రాథమిక విద్యార్థులకు చదువు, భాషా అవగాహన, సంఖ్యాపాటవాన్ని మెరుగుపరచడానికి డిఫరెన్షియేటెడ్ లెర్నింగ్ గ్రూపింగ్‌లు %ఱ% రోజువారీ కార్యకలాపాల ప్రణాళిక అమలు చేశారు.

పాఠశాల విద్యార్థుల్లో నైతిక విలువలపై అవగాహన కోసం విజయవాడలో విలువల విద్యాసదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రప్రభుత్వ సలహాదారు, ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు, మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. విద్యార్థుల్లో నైతికత, వ్యక్తిగత క్రమశిక్షణ, జీవిత విలువలపై ద ృష్టి సారించిన ప్రభుత్వం.. ప్రత్యేక పాఠ్యాంశాలను సైతం ఏర్పాటుచేసింది. విలువలు & ప్రేరణాత్మక మార్గదర్శకత్వాన్ని పాఠశాల విద్యా ఫ్రేమ్‌వర్క్‌లో భాగస్వామ్యం చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. రాజ్యాంగ దినోత్సవం (నవంబర్ 26, 2025) సందరరేగా పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యాన విద్యార్థులకు చట్టసభలపై అవగాహన కల్పించేందుకు మాక్ అసెంబ్లీని అమరావతి శాసనసభ ప్రాంగణంలో ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రితోపాటు స్పీకర్, మంత్రులు, సభ్యుల పాత్రల ద్వారా డెమొక్రటిక్ ప్రాసెస్‌ల సిమ్యులేషన్ అందించి, నిర్మాణాత్మక చర్చలతో విద్యార్థులు రాష్ట్రప్రజలను ఆకర్షించారు. ఈ సందరరేగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాలల భారత రాజ్యాంగాన్ని విడుదల చేశారు. పదోతరగతి విద్యార్థుల్లో ఉత్తీర?తా శాతాన్ని పెంచేందుకు ఎస్ఎస్ సి విద్యార్థులకు వందరోజుల యాక్షన్ ప్లాన్ ప్రారంభమైంది. వార్షిక పరీక్షలకు ముందు పాఠ్యాంశాల సమన్వయం, రివిజన్ సైకిల్స్, పెరార్మేన్స్ ట్రాకింగ్, సన్నద్ధత సపోర్ట్‌పై ద ృష్టి సారించేలా ఈ యాక్షన్ ప్లాన్ చేపట్టారు. పాఠశాలల్లో విద్యార్థులకు క్రమశిక్షణ, వ్యక్తిగత శు భ్రత, డ్రెస్సింగ్, చేతులు శుభ్రపరచడం, సెల్ే కానిడేన్స్, నాయకత్వ పద్ధతులపై అవగాహన కోసం డిసెంబర్ 20న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ & ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసించే 75లక్షలమంది విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రంలో మంత్రి లోకేష్ సారథ్యంలో అమలు చేస్తున్న విద్యాసంస్కరణలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సైతం ఇటీవల ప్రశంసల వర్షం కురిపించారు.

## పేద రోగులకు వైద్య సేవలందించడం గొప్ప వరం

**ఐ.పి.యం డైరెక్టర్ డాక్టర్. సి.శివలీల**



హిమాయత్ నగర్ (ప్రశ్న న్యూస్) నిస్వార్థ దృక్పథం తో పేద రోగులకు వైద్య సేవలందించాలని ఐ.పి.యం. డైరెక్టర్ డాక్టర్. సి . శివలీల పిలుపునిచ్చారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన లాబ్ టెక్నీషియన్ ఖాళీల భర్తీ ప్రక్రియలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 12 మంది ఐ.పి.యం కాంట్రాక్టు ఉద్యోగులు డైరెక్టర్ డాక్టర్. సి. శివలీలను మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి పుష్పగుఛరే అందచేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందరరేగా డాక్టర్. శివలీల మాట్లాడుతు వైద్య శాఖలో పనిచేయడం దేవుడిచ్చిన గొప్ప వరమని, పేద రోగులకు వైద్య సేవలందించే ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిస్వార్థంగా పనిచేస్తు మరింత ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సి. నాగరాజు, విక్రమ్, శ్రావణి, సోనాలి, మాధురి, వాసవి, బాలమణి, మోయిాన్, మధుసూదన్, మోహన్, శంకర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## 2026 నూతన సంవత్సరంలో నూతన విజయాలు సాధించాలి

**- మెట్ పల్లి జూనియర్ సివిల్ జడ్జి : నారం అరుణ్ కుమార్**




మెట్‌పల్లి (ప్రశ్న న్యూస్)జగిత్యాల జిల్లా,మెట్‌పల్లి జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్ గురువారం న్యాయవాదులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శుభాకాంక్షల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందరరేగా జడ్జి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, రాబోయే 2026 సంవత్సరం న్యాయవాదులందరికీ వృత్తిపరంగా కొత్త అవకాశాలు, విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరిచేలా న్యాయవాదులు సేవలందించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమం అనంతరం న్యాయవాదులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుతూ స్వీట్లు పంపిణీ చేసుకున్నారు.ఈ వేడుకల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. ప్రణయ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ అబ్దుల్ హాఫీజ్తో పాటు రాజ్ మహ్మద్, జిల్లా వెంకటేశ్వర్లు, మగ్గిడి వెంకట నర్సయ్య, సోమ భూమేశ్వర్, కోటగిరి వెంకటస్వామి, ఏలేటి రామ్ రెడ్డి, గడ్డం శంకర్ రెడ్డి, దయాకర్ వర్మ, బర్ల లక్ష్మణ్, మధుసూదన్ రెడ్డి, పులి నర్సయ్య, కట్కమ్ వేణుగోపాల్, ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, రాంపల్లి జగన్, నల్ల రాజేందర్, పడిగేలా శ్రీనివాస్, వాల్గోట్ మహేష్, బిగుల్లా శంకర్, ఆకుల మానస, గజభీంకర్ వెంకటేష్, కడారి యుగందర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరం

**- స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ : బొంగాని అశోక్ గౌడ్**

**- అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు**

**- 2026పై సర్పంచ్ అశోక్ ఆశావహ వ్యాఖ్యలు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని స్తంభంపల్లి గ్రామ సర్పంచి బొంగాని అశోక్ గౌడ్ నూతన ఆంగ్ల సంవత్సరం- 2026ను పురస్కరించుకొని గ్రామ, మండల ప్రజలకు హృదయపూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ, “కొత్త సంవత్సరం ప్రతి కుటుంబానికి ఆనందం, ఆరోగ్యం, సమృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే నా ప్రధాన లక్ష్యం. అందరి సహకారంతో స్తంభంపల్లిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తాను. రైతులు పంటలతో సంతోషంగా ఉండాలి, యువత ఉపాధి అవకాశాలతో ఎదగాలి, మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి” అని అన్నారు.అలాగే 2026లో గ్రామంలో మౌళిక సదుపాయాల అభివృద్ధి, పరిశుభ్రత, తాగునీరు, వీధి దీపాల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొంటూ, ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## వేములవాడలో రాష్ట్రస్థాయి కరాటే పోటీలు - బ్రోచర్ ఆవిష్కరణ



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలో ఫిబ్రవరి 8న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి కరాటే పోటీల బ్రోచర్‌ను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు.ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో శ్రీనివాస్ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కరాటే బ్లాక్‌బెల్ట్ గ్రహీత అవధూత రజినీకాంత్, అకాడమీ ఫౌండర్ అబ్దుల్ మన్నన్‌తో పాటు పలువురు కరాటే క్రీడాకారులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# రామగుండంలో సింగరేణి క్వార్టర్లు బేరం..

# ఉద్యోగులకు మొండి చేయి

**ఆర్జీ 2 ఏరియాలో పర్సనల్ డిపార్ట్మెంట్ గణకార్యం**

**నెలకు రూ.6 వేలకే ఇస్తామంటున్న మేనేజర్ వేణుగోపాల్**

**చూసి చూడనట్టు ఉంటున్న డీజీఎం అరవింద్ రావు**

**సిఎండీ, పా డైరెక్టర్, జీఎం ఆదేశాలకు తూట్లు**

**8 ఇంక్లైన్ కాలనీ**





రామగుండం(ప్రశ్న న్యూస్) సింగరేణిలో ఉద్యోగులకు హక్కుగా ఇవ్వాల్సిన కంపెనీ క్వార్టర్లను పర్సనల్ డిపార్ట్ మెంట్ అధికారులు బేరం పెట్టారు. అర్హులైన ఉద్యోగులకు అర్హమైన క్వార్టర్లు కేటాయించకుండా, వాటిని కిరాయికి ఇస్తామని పర్సనల్ మేనేజర్ వేణుగోపాల్, ఉద్యోగులతో బేరాలు ఆడుతున్నట్లు సమాచారం. సింగరేణిలో కంపెనీ నిబంధనల ప్రకారం ప్రతి నెల క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అయితే కొన్ని ఏరియాల్లో మాత్రం ఈ కౌన్సెలింగ్ మూడు, నాలుగు నెలలకోసారి చేపట్టడంపై కార్మిక సంఘాల నేతలు మండిపడుతున్నారు. కార్మికులకు, ఉద్యోగులకు అర్హత మేరకు క్వార్టర్లు



ఇవ్వాల్సిన పర్సనల్ డిపార్ట్ మెంట్ , క్వార్టర్లను అంగడిలో కూరగాయల బేరం పెట్టినట్లు పెట్టిందని కార్మికులు వాపోతున్నారు. అసలు ఎన్ని క్వార్టర్లు ఖాళీలు ఉన్నాయో లెక్కలు చెప్పకుండా గోప్యత పాటిస్తూ సంస్థకు ప్రాణ రక్షణ కవచాలు అయిన కార్మిక లోకానికి తీరని అన్యాయం చేస్తున్నట్లు బహిరంగంగానే యూనియన్ నేతలు దుమ్మెత్తి పోస్తున్నారు.

### ఇప్పుడేం చేస్తున్నారు..

వందలాది క్వార్టర్లు ఖాళీలు ఉన్నాయని ముందుగా నోటిఫికేషన్ ఇస్తున్నారు. అనంతరం కౌన్సెలింగ్ పక్రియ ప్రారంభ దశలో అవి పదుల సంఖ్యకు మారిపోతున్నాయి. పైసలు ఇచ్చిన వారికి నాణ్యమైన, విశాలంగా ఉన్న క్వార్టర్లు కేటాయిస్తున్నారు. డబ్బులు ఇవ్వని కార్మికులకు సవాలక్ష నిబంధనలు చూపించి కనీసం నీరు సరఫరా, కరెంట్ సరఫరా సహా మౌలిక వసతులు లేని క్వార్టర్లు కేటాయిస్తున్నారు. ఇదేమిటి అని అడిగితే దిక్కున్న చోట చెప్పుకోండి అని బ్లాక్ మెయిల్ చేస్తూ పర్సనల్ డిపార్ట్ మెంట్ అధికారులు వేధిస్తున్నారు. ఇప్పటికైనా పర్సనల్ డిపార్ట్మెంట్ కార్మికులకు న్యాయం చేయాలని, అందరికీ నాణ్యమైన క్వార్టర్లు ఇవ్వాలని కోరుతున్నారు.

# ఆటా. బాటా.. అటాక్

**- ఆటలో ఆనందం బాటాలో బాధ - అటాక్ తో అహాకారాలు - నాలుగు మహిళాల వరల్డ్ కప్ లు**



2014 అనగానే గుర్తొచ్చేది హుదూద్ తుఫాన్. 2020 అనగానే గుర్తొచ్చేది కరోనా కాలం యావత్తు ప్రపంచాన్నే అతలకుతలం చేసింది ఈ కరోనా మహ్మారి. ఎందరో అమాయకుల ప్రాణాలను బలితీసుకుంది. ఎందరినో అనాదల్ని చేసింది. మొత్తం ప్రపంచాన్ని కొద్ది రోజుల పాటు ఇంటికే పరిమితం చేసింది. ఎందరో నిరుద్యోగులయ్యారు. కరోనా మరణాలతో పాటు ఈ సమయంలో ఆకలి మరణాలు కూడా సంభవించాయి. ఇలా కొన్ని సంవత్సరాలకు కొన్ని ప్రత్యేకతలు ఉంటాయి. అలా 2025కు మంచి చెడులేంటో తెలుసుకుందామా..

### ఆట..

యుగయుగాలుగా మహిళల వంటింటికే పరిమితమౌతున్న తరుణంలో మహిళలు వివిధ రంగాలలో తనదైన ముద్రను కైవసం చేసుకుంటున్నారు. 2025లో భారత్ లో క్రకికేట్ ఆటలో పురుషులు చేయలేని గెలుపును మహిళలు ఛేదించారు. మహిళలు మహారాణులుగా మారి 2025లో నాలుగు వరల్డ్ కప్ లను భారత మహిళలు సంపాదించిపెట్టారు.

నవంబర్ 2, 2025లో మహిళా క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. నవీ ముంబైలో జరిగిన వన్డే ప్రపంచ కప్ ఫైనల్లో భారత మహిళలు దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించి, మహిళా క్రికేట్ లో టీమీండియా ప్రపంచ ఛాపియన్గా నిలిచింది. డివై పాటిల్ స్టేడియంలో జిరిగిన క్రికెట్ లో భారత్ చాంపియన్ గా నిలిచింది. 47 ఏళ్ల నిరీక్షణ తర్వాత భారత్ మొదటి సారి చరిత్ర సృష్టించారు. దీనితో భారత మహిళల క్రికెట్ కి ఒక కొత్త చరిత్రాత్మక మైలురాయి క్రియేట్ అయింది. అండర్-19 టీ20 వరల్డ్ కప్ లోను బారత్ చరిత్ర సృష్టించింది. మహిళల అండర్ 19 ప్రపంచకప్ 2025 టైటిల్ సాధించింది. దీంతో వరుసగా రెండు సార్లు టీమిండియా టైటిల్ గెలుచుకుంది. తెలుగమ్మాయి త్రిషకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచింది. బౌలింగ్ లోనూ.. బ్యాటింగ్ లోనూ తనదైన రీతిలో అదరగొట్టింది ఈ తెలుగమ్మాయి. భారత అంధ మహిళ క్రికెట్ జట్టు తొలి టీ20 వరల్డ్ కప్ కైవసం చేసుకుంది. అంతే కాదు.. నవంరు 24లో భారత మహిళల కబడ్డీ జట్టు కూడా ప్రపంచ కప్ ను సొంతం చేసుకుంది.

### బాటా..

తెలుగు రాష్ట్రాలలో కర్నూల్ బస్సు అగ్ని ప్రమాదం తీవ్ర కలకలం రేపింది. కావేరి ట్రావేల్స్ బస్సు అగ్నికి ఆహుతి అయ్యింది. ఆక్టోబర 24న జరిగిన ఈ బస్సు ప్రమాదంలో 20 మంది చనిపోయారు. ఈ ప్రమాదంలో 20 మంది సజీవదహనమైన ఘటన యావత్ ప్రపంచాన్ని వణికించింది. 2025లో చాలా ప్రయాణాలు బాధను మిగిల్చాయి.. కొన్ని కుటుంబాలు చిన్నాబిన్నాం చేశాయి. నవంబరు 3 తెలంగాణా రాష్ట్రం రంగారెడ్డి జిల్లా మీర్జాగూడ దగ్గర కూడా ఘోరా రోడ్డు ప్రమాదం జరిగింది. బస్సును టిప్పర్ లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తో సహా మొత్తం 19 మంది చనిపోయారు. అంతే కాదు ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కా చెల్లెల్లు చనిపోయారు. ఇది తీరని బాధగా మిగిలిపోయింది. డిసెంబరు 25న తెల్లవారు జమున జరిగిన మరో అగ్ని ప్రమాదంలో కూడా 20 మంది సజీవ దహనమయ్యారు. ఇవే కాకుండా గుజరాత్ రాజదాని అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో 270 మంది చనిపోయారు.

### అటాక్..

భారత్ పాకిస్తాన్ విడిపోయిన నాటి నుంచి నేటి వరకు భారత్ పై ఉగ్రదాడులు జరుగుతునే ఉన్నాయి. కార్గిల్ లాంటి దాడులు కూడా జరిగాయి.. 2025లో ఏప్రిల్ 22న ప్రకృతికి మారుపేరైన పల్గాం నెత్తుటి తిలకం దిద్దుకుంది. ప్రకృతి అందాలను అస్వాదించడానికి వెళ్లిన పర్యటకులపై ఉగ్రవాదులు విచక్షణా రహితంగా దాడులు చేసి.. ఓ చిన్నారులను అనాధగా మారిస్తే.. మరో భారత మహిళను వితంతువుగా మార్చారు. కొత్తగా పెళ్లైన జంటపై ఉగ్రవాదుల దాడికి యావత్ భారత్ ఆగ్రహానికి గరైంది. దీంతో ఉగ్రదాడికి ప్రతికారంగా భారత్ ఆపరేషన్ సిందూరూ చేపట్టింది. కశ్మీర్ లోని ఉగ్రస్థావరాలపై త్రివిధ దళాల సమన్వయంతో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విరుచుకుపడింది. దాదాపు 100 మంది ఉగ్రవాదులను ఇండియన్ ఆర్మి మట్టి కలిపింది. ఢిల్లీలో బాంబు పేలుడు నవంబరు 10న ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో ఒక కారు పేలీ 13 మంది మరణించారు. 20 మందికి పైగా గాయపడ్డారు. ఆపరేషన్ సిందూర అనంతరం ఇలాంటి దాడేదో జరుగుతుందని భారత్ కి తెలుసు కాబట్టీ తగిన జాగ్రత్తలో ఉన్నప్పటికీ ఈ ప్రమాదం జరిగింది. 2025 సంతోషాలతో పాటు దు:ఖాలను కూడా తన కాలగరరేలో దాచుకుని వెళ్తుంది. రాబోయే 2026 కొత్త సంవత్సరమైన మానవ మనుగడకు సంతోషాల ఆలయం కావాలని కోరుకుందాం.



**అమీనా కలందర్**
**కవిరత్న.. సీనీయర్ జర్నలిస్టు**

## తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక కమిటీ సభ్యునిగా సంజయ్ రెడ్డి నియామకం

**- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర అధ్యక్షుడు ఆనం చిన్ని వెంకటేశ్వర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ**



జగిత్యాల (ప్రశ్న న్యూస్) తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక కమిటీ సభ్యునిగా ఆకుల సంజయ్ రెడ్డిని నియమిస్తూ, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం (టీ జే ఎస్ ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఆనం చిన్ని వెంకటేశ్వర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచమల్ల సుభాష్. ఉపాధ్యక్షులు దారుకోట శేఖర్, ఎడమల మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్ .రాజేందర్, సంయుక్త కార్యదర్శులు ముదాం శ్రీనివాస్ ,గిద్దె తిరుపతి, సిగిరి రాజరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జంగా శ్రీనివాస్ , కార్యవర్గ సభ్యులు లింగా వెంకటేశ్వర్ రెడ్డి, కాసిరెడ్డి నాగరాజు, ఏనుగుల లక్ష్మినారాయణ, రాడే శ్రీనివాస్ తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక కమిటీ సభ్యుడు, జిల్లా ఇన్చార్జి ఆకుల సంజయ్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

**తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం (టీ జే ఎస్ ఎస్) ఎన్నికల్లో**

## జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన రాచమల్ల సుభాష్



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం (టీ జే ఎస్ ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఆనంచిన్ని వెంకటేశ్వర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా కమిటీ ఎన్నికలు జగిత్యాల, హైదర్పల్లి డి ఎల్ ఆర్ ఫంక్షన్ హాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో, విజయవంతంగా నిర్వహించినట్లు టీ జే ఎస్ ఎస్ రాష్ట్ర కార్య నిర్వాహక కమిటీ సభ్యుడు, జగిత్యాల జిల్లా ఇంచార్జి ఆకుల సంజయ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడుగా రాచమల్ల సుభాష్. ఉపాధ్యక్షులుగా దారుకోట శేఖర్, ఎడమల మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆర్ .రాజేందర్, సంయుక్త కార్యదర్శులుగా ముదాం శ్రీనివాస్ ,గిద్దె తిరుపతి, సిగిరి రాజరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా జంగా శ్రీనివాస్ , కార్యవర్గ సభ్యులుగా లింగా వెంకటేశ్వర్ రెడ్డి, కాసిరెడ్డి నాగరాజు, ఏనుగుల లక్ష్మినారాయణ, రాడే శ్రీనివాస్ ఎన్నికయ్యారు. వార్తల ద్వారా ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం అని,జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పాటుపడుతాం అని గెలుపొందిన తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం (టీ జే ఎస్ ఎస్) జగిత్యాల జిల్లా నూతన కార్యవర్గం తెలిపారు. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

### దివ్యాంగుల సహాయార్థం స్నేహ సొసైటీ

# 25వేల రూపాయల చెక్కు



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) బుధవారం రోజు స్థానిక మారుతి నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ వారి దివ్యాంగుల పాఠశాలలో మాధవి రెడ్డి జయంతి వేడుకలను ఆమె తల్లిదండ్రులు బివి రమణారెడ్డి మరియు లక్ష్మీదేవి దివ్యాంగుల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తండ్రి రమణారెడ్డి మాట్లాడుతూ తమ కుమార్తె మాధవిరెడ్డి మరణించి 11 సంవత్సరాలు అవుతుందని ఆమెకు చిన్నపిల్లలు అంటే అమృతమైన ఇష్టమని ఆమె లేని లోటును దివ్యాంగ బాలల్లో చూసుకుంటున్నామని అందుకే ఆమె పుట్టినరోజును ప్రతి సంవత్సరం దివ్యాంగుల మధ్య జరుపుకుంటున్నామని ఆమె పేరిట మాధవిరెడ్డి ఫౌండేషన్ ఏర్పాటు చేసి దివ్యాంగులకు మరియు పేద ప్రజలకు సహాయం అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఆమె జన్మదినాన్ని పురస్కరించుకొని దివ్యాంగులు సహాయార్థం 25వేల రూపాయల చెక్కును అందిస్తున్నామని అదేవిధంగా మానసిక దివ్యాంగులకు యోగ నేర్పించి వారిని ప్రయోజకులుగా మారుస్తున్న యోగ ఉపాధ్యాయురాలు వీణ కు వేల 2500 రూపాయలు చెక్కును అందించారు అనంతరం దివ్యాంగులకు మిఠాయిలు మరియు బిస్కెట్లను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ముబారక్ నగర్ కాలనీవాసులు శ్రీనివాస్ మరియు కవితలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్. సిద్దయ్య, అందుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి మరియు పాఠశాలల సిబ్బంది మానసిక దివ్యాంగులు మరియు అందులు పాల్గొన్నారు.

## మిడ్ మానేరు ముంపు నిర్వాసితుల

# సమస్యలు పరిష్కరించాలి

- రూ.5.04 లక్షలు ఇంకా పెండింగులోనే...!
- ఉపాధి కోల్పోయిన నిర్వాసితులకు భరోసా కల్పించాలి
- ఎమ్మెల్యే సత్యం కు భాస్కర్ వినతి సన్మానం
- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామం మిడ్ మానేరు జలాశయంలో పూర్తిగా ముంపునకు గురైన నేపథ్యంలో, గ్రామానికి చెందిన నిర్వాసితుల పెండింగ్ సమస్యలను పరిష్కరించి పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించాలని నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో కలిసి చొప్పదండి ఎమ్మెల్యే మెడిపల్లి సత్యంకు వినతిపత్రం సమర్పించారు. తొలిసారిగా సర్పంచ్ హోదాలో ఎమ్మెల్యే ను కలిసిన నేపథ్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ భాస్కర్ మాట్లాడుతూ, మిడ్ మానేరు జలాశయం నిర్మాణం కోసం నీలోజిపల్లి గ్రామస్తులు ఇళ్లతో పాటు వ్యవసాయ భూములను పూర్తిగా కోల్పోయారని, భూముల నష్టంతో జీవనోపాధి కూడా దూరమైందన్నారు. సర్వం త్యాగం చేసినప్పటికీ నిర్వాసితులకు ఇంకా పూర్తి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది ఇండ్లకు ఇప్పటికీ పరిహారం అందలేదని, ఇండ్ల వద్ద ఖాళీ జాగాలకు పరిహారం చెల్లించలేదని, ఆడపిల్లలకు సంబంధించిన ప్యాకేజీ పూర్తిగా ఇవ్వలేదని తెలిపారు. అలాగే అర్హతలు ఉన్నప్పటికీ పలువురికి ప్లాట్ల పట్టాలు మంజూరు కాలేదని, వృత్తి మార్పు అంశంలో వ్యవసాయ కూలీలను 'స్టూడెంట్'గా గెజిట్‌లో తప్పుగా నమోదు చేయడం వల్ల కుటుంబాలకు రావాల్సిన పరిహారం నిలిచిపోయిందన్నారు. నిర్వాసితులకు హామీ ఇచ్చిన రూ.5,04,000 కూడా ఇప్పటివరకు చెల్లించలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, ఎమ్6 ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, ఆర్డీఓల సమక్షంలో గ్రామ సభ నిర్వహించి నిర్వాసితుల సమస్యలను సమగ్రంగా పరిష్కరించి నష్టపరిహారం ఇప్పించాలని, అలాగే నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ను సర్పంచ్ అనుముల భాస్కర్ విజ్ఞప్తి చేశారు. వినతి మేరకు ఎమ్మెల్యే స్పందించి, త్వరలోనే నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని సర్పంచ్ భాస్కర్ వెల్లడించారు.

## నిజామాబాద్ కలెక్టర్ గా

## బాధ్యతలు స్వీకరించిన ఇలా త్రిపాఠి

**స్వాగతం పలికిన అదనపు కలెక్టర్లు, అధికారులు**



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా కలెక్టర్ గా ఇలా త్రిపాఠి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మధ్యాహ్నం 2.40 గంటల సమయంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్దకు చేరుకున్న జిల్లా కలెక్టర్ ను అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ సాదరంగా స్వాగతం పలికారు. నేరుగా తన చాంబర్ కు చేరుకున్న కలెక్టర్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కలెక్టర్ ను పలువురు శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించి పరిచయం చేసుకున్నారు. కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, ఉద్యోగ సంఘాల నాయకులు కలెక్టర్ కు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు.

## ప్రశాంత వాతావరణంలో

# నూతన సంవత్సర వేడుకలు జరుపుకోండి

శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తిలో సబ్ డివిజనల్ పోలీస్ శాఖ నూతన సంవత్సరం 2026 సందర్భంగా ప్రజలకు, శ్రీకాళహస్తి పోలీసు నూతన సంవత్సర శుభాకాంక్షలు ప్రజలు ఈ నూతన సంవత్సర వేడుకలు బాధ్యత తో శాంతి యుతంగా జరుపుకోవాలి. ప్రజల భద్రత మరియు శాంతి భద్రతల పరిరక్షణ లో భాగంగా నూతన సంవత్సరం సందర్భంగా కొన్ని ఆంక్షలు విధించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా నిర్దిష్ట సమయంలో హొటళ్లు మద్యం షాపులు, బార్లు వివిధ షాపులు మూసివేత. శ్రీకాళహస్తి పట్టణ వ్యాప్తంగా ఈరోజు రాత్రి జనవరి 1 వ తేదీన పటిష్ట బందోబస్తు. జిల్లా వ్యాప్తంగా డి జే లు లౌడ్ స్పీకర్లతో శబ్దకాలుష్యం మరియు అశ్లీల నృత్యాలు నిషేధం. ఉల్లంఘిస్తే కేసులు నమోదు. బహిరంగ ప్రదేశాలలో కేక్ కటింగ్, డాన్సులు,



పార్టీలు, రంగులు పూయడం, టపాకాయలు కాల్చడం నిషేధం. బైక్ రేసింగ్ లు, అతి వేగంగా వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడిపితే, మైనర్లకు వాహనాలు ఇచ్చినా, నడిపినా చట్టపరమైన చర్యలు



మరియు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు కి సిఫారసు. ప్రవేట్ ప్రదేశాలలో జరిగే కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి- జిల్లా వ్యాప్తంగా ముఖ్యమైన ప్రదేశాలలో డ్రోన్లతో నిఘా. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే



కఠిన చర్యలు. యువత తొందరపాటు చర్యలకు పాల్పడి, కేసు లో ఇరుక్కొని విలువైన జీవితం పాడుచేసుకోవద్దు. నూతన్ సంవత్సరం రోజు అనేది ప్రతి కుటుంబానికి పండుగలా ఉండాలి

## చొప్పదండి యూత్ కాంగ్రెస్ అధ్యక్ష

## పదవికి యజ్ఞేశ్ రాజీనామా - ఆమోదం

- పార్టీ క్రమశిక్షణ చర్యలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లాధ్యక్షులు : ముత్యం శంకర్



గంగాధర / చొప్పదండి (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వొడ్నాల యజ్ఞేశ్ తన వ్యక్తిగత కారణాలను తెలియజేస్తూ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను యూత్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డికు పంపించారు. రాష్ట్ర అధ్యక్షుడి ఆమోదంతో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ జిల్లా ఇంచార్జి పెద్దెల్లి తేజస్విని ప్రకాష్ యజ్ఞేశ్ రాజీనామాను అధికారికంగా ఆమోదించారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్ మాట్లాడుతూ, పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చొప్పదండి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్‌కు త్వరలోనే నూతన అధ్యక్షుడిని నియమిస్తామని వెల్లడించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైన ఈ సమావేశంలో బోయినిపల్లి మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ కుమార్, రామడుగు మండల అధ్యక్షుడు పరుశురాం గౌడ్, చొప్పదండి మండల అధ్యక్షుడు అఖిల్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు గోల్కొండ రాజు, అసెంబ్లీ జనరల్ సెక్రటరీ శ్రీకాంత్ యాదవ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## 2026 నూతన సంవత్సరం ప్రజల

## జీవితాల్లో సుఖశాంతులు నింపాలి

- యూత్ కాంగ్రెస్ వేములవాడ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి : ఇన్నారం సాగర్



వేములవాడ (ప్రశ్న న్యూస్) నూతన ఆంగ్ల సంవత్సరం - 2026 వేములవాడ నియోజకవర్గ ప్రజలకు శాంతి, సంతోషాలు, అభివృద్ధి తీసుకురావాలని యూత్ కాంగ్రెస్ వేములవాడ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఇన్నారం సాగర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు సస్యశ్యామల పంటలతో లాభాలు పొందాలని, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో ఆర్థికంగా ముందుకు సాగాలని కోరుకున్నారు. అలాగే ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కు, నియోజకవర్గ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడాలని ఆయన అభిప్రాయపడ్డారు.

## శ్రీ భీమేశ్వర స్వామి వారి సేవలో

## వడోదర ఐఆర్ఎస్ అధికారి వంశీకృషా రెడ్డి



వేములవాడ (ప్రశ్న న్యూస్)తెలంగాణ అతి ప్రాచీన దేవాలయంగా, దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో గుజరాత్ రాష్ట్రం వడోదరలో విధులు నిర్వహిస్తున్న ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) అధికారి, తెలంగాణకు చెందిన గుంటుకు వంశీ కృషా రెడ్డి గురువారం దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ అధికారులు ఆశీర్వచన మండపంలో వేదోక్త ఆశీర్వచనం నిర్వహించి, స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేశీ గోవంశ రక్షణ సమితి ప్రాంత సంపర్క ప్రముఖుడు ఊట్కూరి రాధాకృష రెడ్డి, వేములవాడ మండల సంపర్క ప్రముఖుడు రేగూరి లక్ష్మణ్, వేములవాడ మండల సహా ప్రముఖుడు మహేష్ కావళ్లతో పాటు ఇతరులు పాల్గొన్నారు.

## హన్మాజీపేటలో చిరుత సంచారం

## - భయాందోళనలో ప్రజలు

- చిరుత సంచారం నిజమే..! పాదముద్రలను దృవీకరించిన అటవీశాఖ అధికారులు



వేములవాడ (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట గ్రామంలో చిరుత పులి సంచారం కలకలం రేపుతోంది. గ్రామ శివారులో లభించిన పాదముద్రలను పరిశీలించిన తెలంగాణ అటవీ శాఖ అధికారులు అవి చిరుత అడుగులేనని ధృవీకరించారు. చిరుత సంచారం నేపథ్యంలో గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ హెచ్చరించింది. రాత్రి వేళల్లో బయటకు రావద్దని, పొలాలకు వెళ్లే రైతులు, పశువుల కాపరులు గుంపులుగా వెళ్లాలని సూచించింది. అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరింది.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- చెస్ క్రీడాకారుడు సుబ్రహ్మణ్యం

**ఘనంగా శ్రీ చైతన్య స్కూల్స్ జోనల్ స్పోర్ట్స్ మీట్**




ఉప్పల్( ప్రశ్న న్యూస్) శ్రీ చైతన్య విద్యా సంస్థల ఫౌండర్ డాక్టర్ బి.ఎస్.రావు జ్ఞాపకార్థం శ్రీ చైతన్య నారాయణగూడ జోన్ ఆధ్వర్యంలో నాచారం లో జోనల్ స్పోర్ట్స్ మీట్-2025 ను ఘనంగా నిర్వహించారు. ఈ క్రీడా పోటీలకు చెస్ క్రీడాకారుడు జే. సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో ఆటల్లో ముందుండాలని, క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని, విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలని, విద్య నేర్పిన గురువులను ఎప్పటికీ మర్చిపోవద్దు అని చెస్ ఆడడం వల్ల చురుగ్గా ఉంటామని ఈ సందర్భంగా విద్యార్థులకు తెలిపారు. ఈ పోటీలలో బర్కత్ పుర, హబ్సిగూడ, మేడిపల్లి, నల్లకుంట, నాచారం, తార్నాక హిమాయత్ నగర్ శాఖల విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు నారాయణగూడ జోన్ ఏజీఎం నూర్ మహమ్మద్ అలీ, ఆర్. ఐ. వెంకట్, అఖిల భారత శారీరక విద్యా విభాగం రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ లు హాజరై విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణగూడ జోనల్ కోఆర్డినేటర్స్, ప్రధానోపాధ్యాయులు, జోనల్ పిఈటిలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరం - 2026 ప్రజలకు

## శుభఫలాలు తీసుకురావాలి

**విలాసాగర్ గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు : ఏనుగుల కనకయ్య**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, బోయినిపల్లి మాజీ సెస్ డైరెక్టర్ ఏనుగుల కనకయ్య నూతన ఆంగ్ల సంవత్సరం-2026ను పురస్కరించుకొని జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2026 సంవత్సరం జిల్లా ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆరోగ్యం, శాంతి సమృద్ధిగా అందించాలని ఆకాంక్షించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించి, యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలని, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరి, పేద ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలని అన్నారు. గ్రామాలు, పట్టణాలు సమానంగా అభివృద్ధి చెందుతూ, జిల్లా సర్వతోముఖాభివృద్ధి సాధించాలనేదే తన ఆకాంక్షగా ఆయన తెలిపారు. నూతన సంవత్సరం ప్రతి కుటుంబానికి కొత్త ఆశలు, కొత్త విజయాలు అందించాలని కోరుతూ మరోసారి జిల్లా ప్రజలందరికీ ఏనుగుల కనుకయ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



## నిహారిక కొత్త సినిమా.. చిల్, థ్రిల్ అంటూ..

బ్యూటిఫుల్ నిహారిక కొణిదెల నిర్మాతగా సత్తా చాటుతోంది. నటిగానూ ప్రూవ్ చేసుకునే ప్రయత్నం చేస్తుంది. హీరోయిన్‌గా ఆఫర్లు అందుకుంటూనే ప్రొడ్యూసర్‌గానూ బిజీగా ఉంటోంది.ఇప్పటికే 'కమిటీ కుర్రాళ్లు' సినిమాకు నేషనల్ అవార్డుతోపాటు పలు అవార్డులు అందుకుంది. మంచి మార్కులు కొట్టేసింది.

ఈ క్రమంలో సంగీత్ శోభన్‌తో ప్రాజెక్ట్ అనౌన్స్ చేసింది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్ బ్యానర్‌పై క్రేజీ కాన్సప్ట్‌తో రాబోతుంది.ఇంతకు ముందు చూడని విధంగా చిల్స్ అండ్ థ్రిల్స్ ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మానస శర్మ దర్శకత్వంలో రాబోతున్న ఈ మూవీ క్వాలిటీ, క్వాంటిటీ హండ్రెడ్ పర్సెంట్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు మేకర్స్. ఇక జీ స్టూడియోస్ సమర్పిసతున్న ఈ సినిమాకు ఉమేశ్ కుమార్ భన్సాల్ మరో నిర్మాత.

## మరో నిర్మాణ సంస్థను ప్రకటించిన బండ్ల గణేశ్



నటుడిగా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత నిర్మాతగా మారిన బండ్ల గణేష్, మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఆంజనేయులు' చిత్రంతో సినీ నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు. ఈ సినిమాతోనే ఆయన తన సొంత బ్యానర్ 'పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్'ను ప్రారంభించారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన సంచలన బ్లాక్‌బస్టర్ 'గబ్బర్ సింగ్' చిత్రంతో ఈ బ్యానర్‌కు మొదటి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ లభించింది. ఈ సినిమా బండ్ల గణేష్‌ను ఒక విజయవంతమైన నిర్మాతగా సుస్థిరం చేసింది. ఆ విజయం స్ఫూర్తితో, ఈ బ్యానర్ 'బాద్‌షా', 'ఇద్దరమ్మాయిలతో', 'టెంపర్' వంటి అనేక ప్రతిష్టాత్మక, కమర్షియల్‌గా విజయవంతమైన చిత్రాలను నిర్మించి తెలుగు సినిమాలో ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. అయితే ఇప్పుడు తన కొత్త నిర్మాణ సంస్థ 'బండ్ల గణేష్ బ్లాక్‌బస్టర్స్ (బీజీ బ్లాక్‌బస్టర్స్)'ను అనౌన్స్ చేశారు. ఈ కొత్త అధ్యాయాన్ని మరింత ప్రత్యేకంగా మార్చే విషయం ఏమిటంటే.. ఇందులో నెక్స్ట్ జనరేష్ భాగస్వామ్యం కావడం. ఇప్పటికే ఓ ప్రాజెక్ట్ ఖరారు కాగా ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది.

## మెగా విక్టరీ మాస్.. స్టెప్పులు అదిరిపోయాయి..



సంక్రాంతి వేడుకలు ముందుగానే ప్రారంభమయ్యాయి. మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ కలిసి నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు' నుంచి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న థర్డ్ సింగిల్ రిలీజ్ అయింది.'మెగా విక్టరీ మాస్' కాంబినేషన్, డైనమిక్ కెమిస్ట్రీ అదిరిపోయింది. ప్రేక్షకులను అలరించే సాంగ్స్ రూపొందించడంలో ప్రసిద్ధి చెందిన భీమ్స్ సిసిరోలియో అద్భుతమైన ట్రాక్‌ను అందించగా.. నక్ష్ అజీజ్, విశాల్ దద్లాని పవర్ ఫుల్ వోకల్స్ అందిస్తూ పాటలో ఎనర్జీ నింపారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం పక్కా మాస్ టచ్‌తో పాటు నాస్టాల్జియా ఫీల్‌ని మేళవించి, ఈ స్టార్ స్టడెడ్ రీయూనియన్‌కి పర్ఫెక్ట్‌గా నిలిచింది. స్టైలిష్ పబ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన ఈ పాటలో ఇద్దరు పవర్‌హౌస్ పెర్ఫార్మర్లు అదరగొట్టారు. చిరంజీవి మెగాస్టార్ ఆరా, వెంకటేష్ క్లాసీ చార్మ్ కలిసి ప్రతి ఫ్రేమ్ అద్భుతంగా ఉంది. కొరియోగ్రాఫర్ విజయ్ పోలకి హై–వోల్టేజ్ స్టెప్పులతో పాట ఎనర్జీని మరింత పెంచారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న మూవీలో నయనతార హీరోయిన్ కాగా.. చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గరపాటి, సుష్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. అర్చన ప్రజెంట్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్.. సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల కానుంది.

## 'సిన్నారి కోన..' సందడి షురూ

తరుణ్ భాస్కర్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఈషా రెబ్బా హీరోయిన్. ఏ.ఆర్. సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్స్ పై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివరపు నిర్మిస్తుం డగా, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ మంచి బజ్ క్రియేట్ చేసింది. ఇప్పుడు మేకర్స్ ఫస్ట్ సింగిల్ 'సిన్నారి కోన..' సాంగ్‌ని రిలీజ్ చేసిన మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేశారు. అప్పగింతలు బ్యాక్ డ్రాప్‌లో కంపోజర్ జయకృష్ణ ఈ సాంగ్‌ను బ్యూటీఫుల్ మెలోడీగా స్వరపరిచారు. జయకృష్ణ, అనన్య భట్, ఎం.జి. నరసింహ వోకల్స్ పాటకు ఫీల్‌ని తీసుకొచ్చాయి. భరద్వాజ్ గాలి రాసిన సాహిత్యం అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ సాంగ్‌లో తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా కెమిస్ట్రీని ప్రజెంట్ చేసిన తీరు ఆసక్తికరంగా ఉంది. కొత్తగా పెళ్లైన జంటగా విభిన్నమైన పాత్రల్లో కనిపిస్తూ, వారి మధ్య భావోద్వేగాలను సహజంగా పలికించారు. ముఖ్యంగా ఈషా రెబ్బా, కొత్త ఇంటికి అలవాటు పడుతున్న నవ వధువు పాత్రలో కనిపించే నాజూకుతనం, భావోద్వేగాలను ఎంతో అందంగా ప్రదర్శించారు. వినగానే ఆకట్టుకునే ఈ సాంగ్ ఇన్‌స్టంట్ హిట్‌గా నిలిచింది. జనవరి 23న వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా ఈ సినిమా రిలీజ్ కానుంది అని మేకర్స్ చెప్పారు.



## మన ఆది హిట్ కొట్టాడు.. సాయి కుమార్ సంతోషం



ఆది సాయి కుమార్ హీరోగా నటించిన 'శంబాల' చిత్రం సక్సెస్ ఫుల్‌గా దూసుకుపోతోంది. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద మహీధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు సంయుక్తంగా నిర్మించారు. యుగంధర్ ముని దర్శకత్వం వహించిన చిత్రం డిసెంబర్ 25న విడుదలై థియేటర్స్‌లో విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ క్రమంలో సోమవారం నాడు చిత్రానికి సంబంధించిన విజయోత్సవ వేడుక డివైన్ బ్లాక్ బస్టర్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏస్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్, ప్రముఖ దర్శకులు వశిష్ట, బాబీ, యంగ్ హీరో సందీప్ కిషన్, ప్రముఖ రచయిత కోన వెంకట్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన అల్లు అరవింద్.. 'శంబాల' మూవీని చూసి నేను చాలా ఎంజాయ్ చేశానని తెలిపాడు. ఆదికి వచ్చిన సక్సెస్ చూసి అందరూ సంతోషిస్తున్నారని డైరెక్టర్ బాబి తెలపగా.. నిజాయితీగా సినిమా తీస్తే ప్రేక్షకులు సక్సెస్ ఇస్తారని మరోసారి నిరూపించారని సంతోషం వ్యక్తం చేశాడు సందీప్ కిషన్. 'శంబాల'ను థియేటర్‌లోనే చూడమని కోరిన హీరో ఆది.. కచ్చితంగా డిజప్పాయింట్ కారని హామీ ఇచ్చాడు. ఇక ప్రతీ ఒక్కరూ 'మన ఆది హిట్ కొట్టాడు'అని చెప్తుంటే ఆనందంగా ఉందన్నాడు సాయి కుమార్.

## ఇడియట్ ఆలోచన వద్దు..



2009లో వచ్చిన బాలీవుడ్ బ్లాక్ బస్టర్ త్రీ ఇడియట్స్ కొనసాగింపుగా ఫోర్ ఇడియట్స్ తీసే ప్లాన్ లో దర్శకుడు రాజ్ కుమార్ హిరానీ ఉన్నట్టు వచ్చిన వార్త కొన్ని వారాల క్రితం బాగా వైరలయ్యింది. అధికారికంగా ప్రకటన రానప్పటికీ ఖచ్చితంగా లాక్ అయ్యిందనే రీతిలో ముంబై మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఇందులో కీలక పాత్ర పోషించిన మాధవన్ తాజాగా స్పందిస్తూ సీక్వెల్ ఆలోచన ఈడియాటిక్ గా ఉందంటూ కామెంట్ చేయడం అభిమానులను ఆశ్చర్యపరుస్తోంది. 19 సంవత్సరాల తర్వాత ఇప్పుడీ వయసులో తామేం చేస్తున్నట్టు చూపిస్తే జనాలు కనెక్ట్ అవుతారో అర్థం కావడం లేదని అన్నాడు.హిరానీతో మరోసారి పని చేయడం తనకెప్పుడూ ఆనందంగా ఉంటుందని చెబుతూనే 3 ఇడియట్స్ కొనసాగింపు వద్దని చెప్పడం గమనార్హం. నిజానికి ప్రాక్టికల్ కోణంలో ఆలోచిస్తే తను చెప్పింది కూడా రైటే. రెండు దశాబ్దాల తర్వాత కథను కంటిన్యూ చేయడం చాలా రిస్క్. పైగా అప్పట్లో దీన్ని ఎగబడి చూసిన యువత ఇప్పుడు లేట్ ఏజ్ దారిలో ఉంటారు. వాళ్ళు అదే పనిగా ఎంజాయ్ చేస్తారని గ్యారెంటీ లేదు. అసలు అమీర్ ఖాన్ క్యారెక్టర్ ని ఎలా డిజైన్ చేస్తారనేది పెద్ద పజిల్. యాక్టర్స్ అందరూ దాదాపు బ్రతికే ఉన్నారు కానీ ఏజ్ ఇష్యూ వల్ల వాళ్లలో ఎందరు అంతే యాక్టివ్ నెస్ తో ఉంటారనేది చెప్పలేం. ఇప్పటికైతే అధికారిక ప్రకటన ఇంకా రాలేదు కాబట్టి 3 ఇడియట్స్ గురించి వస్తున్న వార్తలు పుకారుగానే పరిగణించాల్సి ఉంటుంది. అయినా రాజ్ కుమార్ హిరానీ లాంటి గొప్ప దర్శకుడు ఏదైనా కొత్త కథతో ఆడియన్స్ ముందుకు రావాలి తప్పించి ఎప్పుడో ఆయనే తీసిన పాత సినిమాకు పార్ట్ 2 చూపించడం సబబు కాదు.

## 'ఘంటసాల ది గ్రేట్' మ్యూజికల్ కన్సర్ట్..



దిగ్గజ సంగీత దర్శకుడు, తన విలక్షణమైన బాణీలతో కోట్లాది మంది ప్రేక్షకుల హృదయాలను దోచుకున్న ఘంటసాల వారి జీవిత చరిత్రను తెరపైకి తీసుకు వచ్చారు దర్శకుడు సి.హెచ్. రామారావు. ఆయన జీవితాన్ని ఆధారంగా చేసుకుని 'ఘంటసాల ది గ్రేట్' అనే చిత్రాన్ని తెరకెక్కించారు. అన్యుక్త్ రామ్ పిక్చర్స్ బ్యానర్‌పై శ్రీమతి సి.హెచ్. ఫణి నిర్మించారు. ఈ చిత్రంలో ఘంటసాల గారి పాత్రను సింగర్ కృష్ణ చైతన్య పోషించగా.. కీలక పాత్రలో సుమన్ నటించారు. ఈ మూవీని జనవరి 2న ఘనంగా రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో స్వరవాహిని, శ్రీభారతి మ్యూజిక్ అకాడమీ సంయుక్తంగా 'ఘంటసాల ది గ్రేట్.. స్పెషల్ మ్యూజికల్ నైట్' ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడనిన దర్శకుడు సిహెచ్ రామారావు.. "ఘంటసాల గారి పాటల గురించి మనం కొత్తగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. కానీ ఆయన వ్యక్తిత్వం గురించి చెప్పాలనే ఉద్దేశంతోనే ఈ 'ఘంటసాల ది గ్రేట్' మూవీని చేశాను. ఓ సారి శ్రీశ్రీ గారు ఘంటసాల వారి వద్దకు వెళ్లారు. ఆయన రాసిన పాటను ఘంటసాల గారు పాడిన తరువాత శ్రీశ్రీ గారు మంత్ర ముగ్దులయ్యారు. 'నేను ఇంత గొప్ప పాట రాశానా? అని మీరు పాడిన తరువాత అనిపిస్తోంది' అని శ్రీశ్రీ ప్రశంసించారు. అంత గొప్ప గాయకుడు ఘంటసాల. ఈ మూవీని తెలుగు ప్రేక్షకులందరూ చూసి విజయాన్ని అందించాలి' అని అన్నారు.

## తెలుగు ఫిల్మ్ ఛాంబర్ సంయుక్త కార్యదర్శిగా మోహన్ వడ్లపట్ల ఏకగ్రీవ ఎన్నిక

హైదరాబాద్: తెలుగు సినీ పరిశ్రమకు సంబంధించిన ప్రముఖ సంస్థ తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో ప్రధాన పదవులకు జరిగిన తాజా ఎన్నికల్లో నిర్మాత మోహన్ వడ్లపట్ల మరోసారి కీలక బాధ్యతలు దక్కించుకున్నారు.'మన ప్యానల్' నుంచి పోటీ చేసిన ఆయన, నిర్మాతల విభాగానికి ప్రాతినిధ్యం వహిస్తూ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా గెలుపొంది, అనంతరం 2025–2027 పదవీకాలానికి సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మోహన్ వడ్లపట్ల సభ్యులకు, నూతన కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని చెప్పారు. "గత కమిటీలో దిల్ రాజు అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సంయుక్త కార్యదర్శిగా పనిచేశాను, ఈ పర్యాయం దగ్గుబాటి సురేష్ బాబు అధ్యక్షుడిగా ఉన్న కమిటీలో సంయుక్త కార్యదర్శిగా పని చేయడం సంతోషంగా ఉంది." అని మోహన్ వడ్లపట్ల తెలిపారు. ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు, వైస్ ప్రెసిడెంట్లుగా నాగవంశీ, భరత్ చౌదరి, కార్యదర్శిగా అశోక్ కుమార్, ట్రెజరర్‌గా ముత్యాల రాందాస్ విజయం సాధించారు. ఈ నూతన కార్యవర్గం 2027 వరకు కొనసాగనుంది. తెలుగు సినిమా నిర్మాణ, పంపిణీ, ప్రదర్శన రంగాలకు ఫిల్మ్ ఛాంబర్ కీలక దిక్సూచి సంస్థగా నిలుస్తుండగా, మోహన్ వడ్లపట్ల ఏకగ్రీవ ఎన్నికతో నిర్మాతలకు మద్దతుతో పాటు, పరిశ్రమ అభివృద్ధి దిశలో మరింత బలోపేత దిశగా అడుగులు పడనున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన అనుభవం, పరిశ్రమ పట్ల నిబద్ధత ఫిల్మ్ ఛాంబర్‌కు మరింత ఉపయోగకరంగా ఉండనుంది అని పలువురు నిర్మాతలు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలుపుతున్నారు.



## కిష్టాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో

# ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన

**గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఊశయ్య**



మెదక్ ప్రతినిధి(ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం నాడు గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఊశయ్య ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరలను గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులకు మరియు గ్రామ ప్రజలకు ఇందరమ చీరలు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ ఇందిరమ్మ చీరలు పంపిణీ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తామని వారు తెలిపారు అందువలన ప్రతి ఒక్కరు ఇందిరమ్మ చీరలు తీసుకోవాల్సిందిగా గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఊశయ్య తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చందపురం నిర్మల శేఖర్, వార్డు సభ్యులు అక్కిం ప్రవీణ్ యాదవ్, పసుల ప్రసాద్ యాదవ్, పసుల రేఖ, చాకలి యశోద, తోశ నవీన్, బొక్కల శేఖర్ యాదవ్, ఏంబరి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా ప్రజలకు నూతన

# సంవత్సర శుభాకాంక్షలు

**జిల్లా జర్నలిస్ట్ భవన్ కుమార్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రజలకు,ఉమ్మడి జిల్లా జర్నలిస్టులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు మెదక్ జిల్లా యూత్ ఐకాన్ లీడర్ భువన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్ల నామ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలు 2026 ఏడాది ప్రతి ఒక్కరికి శుభాలను చేకూర్చాలని,ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.జిల్లా ప్రజలందరు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని అభిలషించారు.కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలు,ఆశయాలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని,ఎల్లవేళలా మంచి జరగాలనే ఆకాంక్ష వెలిబుచ్చారు.2025 సం. లో ఎదురైన అనుభవాలను సానుకూలంగా మల్చుకుని, 2026 నూతన సంవత్సరంలో మరింత పట్టుదల, అవిరళ కృషితో విజయాలను కైవసం చేసుకోవాలన్నారు.అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల అమలులో కొత్త సంవత్సరంలో రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తూ జిల్లాను మరింత వడివడిగా ప్రగతి పథాన పయనింపజేసేందుకు కలిసికట్టుగా కృషిని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు.నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికి గెలుపునందించే సంవత్సరం కావాలని యూత్ ఐకాన్ లీడర్ అభిలషించారు.

# గీతంలో రక్తదాన శిబిరం

**ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో నిర్వహణ**




పటాన్‌చెరు(ప్రశ్న న్యూస్)గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ బ్లడ్ సెంటర్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎన్ఎస్ఎస్ అధ్యాపక, విద్యార్థి సమన్వయకర్తలతో కలిసి, గీతం హైదరాబాదు రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ ఈ శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దాదాపు 140 మంది విద్యార్థి స్వఛరేద సేవకులు ఈ శిబిరంలో ఉత్సాహంగా పాల్గొని, రక్తదానం చేశారు. దాతలకు ఎన్టీఆర్ ట్రస్టు ప్రశంసా పత్రాలను ప్రదానం చేయడంతో పాటు రిఫ్రెష్ మెంట్లను కూడా అందజేసింది.ఇటువంటి నిస్వార్థ చర్యలు ప్రాణాలను కాపాడటమే కాకుండా ఇతరులు ముందుకొచ్చి సమాజ హితానికి దోహదపడేలా ప్రేరేపిస్తాయని నిర్వాహకులు విద్యార్థుల దాత ృత్వాన్ని ప్రశంసించారు. రక్తదానం నిజంగా ప్రాణదానం వంటిదని, ఇది వ్యక్తులను, సమాజాన్ని బలోపేతం చేసే ఒక నిస్వార్థమైన చర్యగా వారు అభివరించారు.

## ఆనంద్ చిత్రపటానికి

## పూలమాల వేసి ఘనంగా నివాళులు



నిజామాబాద్ (ప్రశ్న న్యూస్) రోటరీ నగర్‌కు చెందిన బీజేపీ పార్టీ క్రియాశీల కార్యకర్త, అర్బన్ ఎమ్మెల్యే అనుచరుడు బట్టికిరి ఆనంద్ దశదిన కర్మ కార్యక్రమం రోటరీ నగర్‌లో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే, ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొని ఆనంద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. అనంతరం ఆనంద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు, అదేవిదంగా బీజేపీ పార్టీ తో పాటు తను కూడ వ్యక్తిగతంగా ఎల్లవేళలా ఆనంద్ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్ ప్రభాకర్, మఠం. పవన్, ముందాడ పవన్, మండల్ బీజేపీ ప్రసిడెంట్ బాబీ సింగ్ స్థానిక కార్యకర్తలు, రోటరీ నగర్ ప్రాంతానికి చెందిన బంధుమిత్రులు పాల్గొని ఆనంద్ కి నివాళులు అర్పించారు.

## ఉద్యోగ జీవితంలో విరమణ తప్పనిసరి

# పెద్దపల్లి డి ఐ ఈ ఓ కల్పన

**శేష జీవితం ఆనందంగా గడపాలని తోటి ఉద్యోగులు.**






మంథని ( ప్రశ్న న్యూస్) ఉద్యోగుల జీవితంలో పదవీ విరమణ అనేది తప్పనిసరిని పెద్దపల్లి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని కల్పనా అన్నారు. బుధవారం మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ సలీం పదవి విరమణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సయ్యద్ సలీం 30 సంవత్సరాలకి పైగా ఉపాధ్యాయ, అధ్యాపక జీవితంలో ఎంతోమంది ఉన్నత స్థానాల్లో నిలవడానికి కారణమయ్యారన్నారు. విధుల్లో అందరితో సరదాగా ఉంటూనే విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిని క్రమశిక్షణలో పెట్టడంలో ముందుంటారన్నారు. తమతో ఎన్నో ఏళ్ళుగా కలిసి పనిచేసిన సలీం సార్ తమ విధుల నుండి దూరం అవుతున్న బాధ ఎంతో ఉంటుందని ఆయన తన శేష జీవితాన్ని ఆనందోత్సవాలతో కుటుంబల మధ్య గడపాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయ స్థాయి నుంచి కళాశాల ప్రిన్సిపల్ గా పనిచేసే నేడు పదవీ విరమణ పొందిన సయ్యద్ సలీం సేవలను కొనియాడారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట డిఐఈఓ , ప్రిన్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రవీందర్ రెడ్డి, మంచిర్యాల డి ఐ ఈ ఓ అంజయ్య, జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపళ్ళు కే రామచంద్ర రెడ్డి, సంజీవయ్య, రవీందర్ రెడ్డి, విశ్వ ప్రసాద్, సుధాకర్, ఉష, రిటైర్డ్ ప్రిన్సిపళ్ళు అంబరీష్, లయాకలీ , పెద్ద సంఖ్యలో పూర్వ , ప్రస్తుత విద్యార్థులలో పాటు అభిమానులు పాల్గొన్నారు.

## మానవ బాంబునై పుట్ట మధును చంపేస్తా.

**అజీం ఖాన్ సంచలన వ్యాఖ్యలు .**




మంథని ప్రశ్న న్యూస్)అంబేద్కర్ చౌరస్తాలో మధుపై కీలక వాక్యాలు చేసిన మాజీ ఏఎంసీ చైర్మన్. అజీమ్ ఖాన్. మంథని అంబేద్కర్ చౌరస్తాలో పబ్లిక్ సమావేశంలో వేలాది మంది చూస్తుండగా వారి సమక్షంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధును పలు ఘాటు వ్యాఖ్యలు చేస్తూ బెదిరించారు. తాను ఉండే ఇల్లును కూడా మేము పేల్చివేస్తామని పలువురు కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేస్తూ ఘాటుగా ప్రశ్నించారు. దీనికి తోడుగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ మేము కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలము తలచుకుంటే నువ్వు రోడ్డుమీద తిరగవని ఘాటుగా స్పందించారు తిరిగితే నీ గతి ఏమవుతుందో అని ఘాటుగా హెచ్చరించారు. ముత్తారం సదానందం మాట్లాడుతూ నీ చరిత్ర మాకు తెలుసని శ్రీధర్ బాబును బతిమిలాడిన విషయాలు మేము మర్చిపోలేదని నీవు మందు తాగిన విషయం మర్చిపోయావ నీవు రోడ్డు మీద పడితే కూడా మిమ్ములను తీసుకొచ్చినమని నీ భార్య శైలజకు తెలుసు మరి నీకు తెలియకపోవడం చాలా విడ్డూరంగా ఉందని ఆత్మ విమర్శ చేసుకోవాలని ప్రజలను ఉద్దేశించి పలు విమర్శనాత్మక భాషను వాడారు. ఐలి ప్రసాద్ మాట్లాడుతూనీ రాజకీయాలు నచ్చకలే ,నువ్వు చేసే ప్రతి పని నచ్చకనే నేను శ్రీధర్ బాబు దగ్గర చేరానని ఘాటు విమర్శలు చేశారు మరి విషయాలన్నీ ప్రజలు ఈ రోడ్డు మీద ఉన్నటువంటి అనేక రకాలైనటువంటి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు , ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారని ఆయిల్ ప్రసాదు మాట్లాడారు . మాజీ సర్పంచ్ శీను మాట్లాడుతూ పుట్ట మధు నీకు రాజకీయ బిక్ష పెట్టిందే గాంధీ చౌక్ అని మీకు సిగ్గు శరం ఉందా అని ఇంకోసారి తిడితే మర్యాదగా ఉండదని నువ్వు రోడ్డుమీద తిరగమని ఇది తెలుసుకొని మీరు గమనించాలని ఘాటుగా స్పందించారు. శశి భూషణ్ కాచే మాట్లాడుతూ పుట్ట శైలజ ఎంపిటిసిగా నామినేషన్ వేస్తే అది తప్పుగా ఉన్నా కూడా మేము మద్దతిచ్చామని మీ బామ్మర్ది భాస్కర్ గ్రానైట్ ఫ్యాక్టరీ కోసం శ్రీధర్ బాబు కాళ్లు మొక్కాడని మీ సడ్డకుడు కూడా ఏసిబి ట్రాప్ లో పడితే శ్రీధర్ బాబు కాళ్ళు మొక్కాడని మరి ఇవన్నీ విషయాలు మర్చిపోయినవా మధు అని మధు పై చలోక్తులు విసిరాడు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, వడ్నాల శ్రీనివాస్, తొట్ల తిరుపతి యాదవ్, చొప్పరి సదానందం, శశిభూషణ్ కాచే, కొత్త శ్రీనివాస్, పెంద్రు రమా, కూర విజయ, శ్రీరామ్ బట్ల సంతోషిని, అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు

## ప్రమాదంలో గాయపడిన కార్మికుడికి

## తాపీమేస్త్రీ సంఘం చేయూత

**- రూ. 10 వేలు నగదు ఆర్థికసాయం అందజేత**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన కార్మికుడు బొడ్డు పర్శరాం ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో కరీంనగర్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన పర్శరాం చికిత్స ఖర్చులకు తోడ్పాటుగా మండల తాపీమేస్త్రీ సంఘం ముందుకొచ్చింది.సంఘ పెద్దలు, సభ్యుల సహకారంతో రూ.10,000 నగదు ఆర్థిక సాయాన్ని బాధితుడి కుటుంబానికి అందజేశారు. ఈ సందరరేగా పర్శరాం త్వరగా కోలుకుని సాధారణ జీవితానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తాపీమేస్త్రీ సంఘం పూర్వ అధ్యక్షులు బొడ్డు రాజలింగంతో పాటు సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే జయంతికి రండి

- మణిమంజరి సాగర్
- 195 జయంతి పండుగకు ఏర్పాట్లు జరుగుతున్నాయి
- బీసీ ప్రజలు అంతా జయంతికి రావాలని ఆహ్వానం
- బీసీ జనం అంతా చేయి చేయి కలపాలి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మహాత్మురాలు చదువుల తల్లి సావిత్రి బాయి పూలే 195 జయంత్యుత్సవాలు జనవరి 3న వైభవంగా జరగనున్నాయి. ఈ మేరకు బీసీ మహిళా సంఘం తరుపున బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఆహ్వానం అందింది. ఏటా జనవరి 3న, హైదరాబాద్ మహానగరంలో సావిత్రిబాయి పూలే జయంత్యుత్సవాలు తెలంగాణ ప్రభుత్వం నియమించే పూలే కమిటీ, బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతాయి.జనవరి 3న జరిగే ఈ వేడుక ప్రముఖ తెలంగాణ మహిళా ఉద్యమకారిణి, బీసీ రథసారథి, కమిటీ అధ్యక్షురాలు మణి మంజరి సాగర్ అధ్యక్షత వహించనున్నారు. ప్రతి సంవత్సరం జనవరి 3న జరుపుకుంటారు, ఆమె 1831 జనవరి 3న మహారాష్ట్రలోని నైగావ్‌లో జన్మించి భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా, సంఘ సంస్కర్తగా, సామాజిక ఉద్యమకారిణిగా, భర్త జ్యోతిరావ్ పూలేతో కలిసి మహిళా విద్యకు, అంటరానితనం నిర్మూలనకు, సామాజిక సమానత్వానికి క ృషి చేయడం విశేషం అని మణిమంజరి తెలిపారు.

## నీలోజిపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీలో అభివృద్ధి పనులకు

## నిధుల మంజూరు పై ఎమ్మెల్యే కు వినతిపత్రం

- ఓపెన్ జిమ్ ఏర్పాటుకు రూ.5 లక్షలు
- అంబేద్కర్ భవన నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరుకు వినతి
- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్






బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామం,ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటు,అంబేద్కర్ సంఘం భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు గురువారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందరరేగా సర్పంచ్ భాస్కర్ మాట్లాడుతూ, మిడ్ మానేరు జలాశయం నిర్మాణం కోసం నీలోజిపల్లి గ్రామం సర్వం త్యాగం చేసి పూర్తిగా ముంపునకు గురైందన్నారు. నిర్వాసితుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన నీలోజిపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీలో ప్రభుత్వం గ్రామ పంచాయతీ భవనం, పాఠశాల,అంగన్వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్ వంటి మౌళిక వసతులు కల్పించినప్పటికీ, గ్రామంలో ఇప్పటికీ ఓపెన్ జిమ్,అంబేద్కర్ సంఘం భవనం లేవని తెలిపారు.యువత ఆరోగ్య పరిరక్షణ, క్రీడా కార్యకలాపాల ప్రోత్సాహానికి ఓపెన్ జిమ్ అవసరమని, అలాగే గ్రామస్థుల సామాజిక-సాంస్క ృతిక కార్యక్రమాల నిర్వహణకు అంబేద్కర్ సంఘం భవనం ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటు కోసం రూ.5 లక్షలు, అంబేద్కర్ సంఘం భవన నిర్మాణం కోసం రూ.10 లక్షలు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.గ్రామాభివ ృద్ధి దిశగా ఈ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకొని తగిన చర్యలు చేపట్టాలని సర్పంచ్ అనుముల భాస్కర్ ఎమ్మెల్యేను కోరారు.ఈ మేరకు సానుకూలంగా స్పందించి,క ృషి చేస్తానని హామీ ఇచ్చారని సర్పంచ్ భాస్కర్ వెల్లడించారు.

## మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను

# అకస్మికంగా తనిఖీ చేసిన

**జిల్లా అదనపు ఎస్పీ మహేందర్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) మెదక్ జిల్లా అదనపు ఎస్పీ శ్రీ మహేందర్ మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను సవివరంగా పరిశీలించి, స్టేషన్‌లోని భద్రతా ఏర్పాట్లు, శుభ్రత, రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న సేవలపై అధికారులకు పలు సూచనలు చేశారు.నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో జిల్లాలో శాంతి భద్రతలు భంగం కలగకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా రాత్రి గస్తీని మరింత బలపరచడం, సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక సిబ్బంది ఏర్పాటు చేయడం, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెంచాలని ఆదేశించారు.అలాగే సీసీ కెమెరాల పర్యవేక్షణ, డయల్-100 స్పందన వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేలా చూడాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వారి విధుల కేటాయింపులు, హాజరు రిజిస్టర్లు, కేసుల నమోదు, పెండింగ్‌లో ఉన్న కేసుల స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు.చట్ట పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలని అదనపు ఎస్పీ సూచించారు. నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా, సురక్షితంగా జరిగేలా ప్రతి పోలీసు అధికారి సమన్వయంతో పనిచేయాలని అన్నారుఈ సందర్భంగా అదనపు ఎస్పీ వెంట మెదక్ డీఎస్పీ శ్రీ ప్రసన్న కుమార్, ఎస్‌హెచ్ లింగం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# అందరితో చర్చిస్తాం

**-సిఎం సిపిఆర్వో మల్సూర్ - జర్నలిస్టుల జాతరకు తప్పకుండా సహకరిస్తాం**
**- జర్నలిస్టు సంఘాల జేఏసీకి హామీ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని అన్ని జర్నలిస్టుల సంఘాలతో సంప్రదింపులు జరిపిన తర్వాతనే అక్రెడిటేషన్, తదితర వ్యవహారాలపై ముందుకు వెళ్ళాలని భావిస్తునట్లు ముఖ్యమంత్రి ఛీఫ్ పిఆర్వో మల్సూర్ అన్నారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం తెలంగాణ జర్నలిస్టు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) సభ్యులతో ముఖ్యమంత్రి ఛీఫ్ పిఆర్వో మల్సూర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసందరరేగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టు సంఘాల జేఏసీ మార్చిలో తలపెట్టిన 'జర్నలిస్టుల జాతర'కు తప్పకుండా సహకరిస్తాని అన్నారు. తమకు అనేక కోణాలలో వివిధ సమస్యలు ద ృష్టికి వచ్చాయని, ప్రతి సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం అనేక విధాలుగా ప్రయత్నాలు చేస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) నేతలు కే.కోటేశ్వర్ రావు, ఆనంచిన్ని వెంకటేశ్వరరావు, బిఎల్ఎన్ చారి, కో-కన్వినర్ సి.హెచ్.వెంకటేశ్వర్లు, రాగుల శ్రవణ్, కో-ఆర్డినేటర్లు మల్లిఖార్జున్, షేక్ అహ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ జోన్ కాప్రా సర్కిల్లో అక్రమ నిర్మాణాల జోరు

- సుప్రీంకోర్టు ఆర్డర్ లో కూడా కూల్చివేతలు చేయవద్దని లేదు.
- అవినీతి అక్రమాలను ఏ కోర్టు సహించదు, కానీ అధికారులు మాత్రం మరో రూటు
- అధికారుల అవినీతితో ప్రభుత్వానికి భారీ ఆర్థిక నష్టం
- కాప్రా సర్కిల్ పరిధిలో రెచ్చిపోతున్న అక్రమ నిర్మాణదారులు
- ఏసీపీ కృష్ణ మోహన్ లంచాల దాహానికి సర్కిల్లో ఎక్కడ చూసిన అక్రమ నిర్మాణాలు
- కూల్చివేతలు లేకపోవడంతో విచ్చలవిడిగా నిర్మాణాలు
- న్యాక్ ఇంజనీర్ల పర్యవేక్షణ లోపంతో కొనసాగుతున్న ఉల్లంఘనలు
- కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలలో చైన్ మెన్ ల హవా







కాప్రా (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఈస్ట్ జోన్ పరిధిలోని కాప్రా సర్కిల్లో అక్రమ నిర్మాణాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా ఉన్నతాధికారి చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ యాదవ్ ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడంతో చైన్ మెన్ ల చేతివాటంతో బిల్డర్లు, అక్రమ షెడ్ నిర్మాణదారులు రెచ్చిపోతున్నారని ఆల్ ఇండియా హిందుస్థాన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బొట్ల సాయిలు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ చర్లపల్లి, కాప్రా డివిజన్లలో అక్రమ నిర్మాణాలు విస్త ృతంగా జరుగుతున్నప్పటికీ అధికారులు కేవలం నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారని చైన్ మెన్ శ్రీధర్ కు ఒక చేతి లేకపోవడంతో ఎలా పనులు ఫీల్డ్లో చేస్తారని అసలు ఆయనని ఏ ప్రతిపాదికన చైన్ మెన్ ఉద్యోగం ఇచ్చారని ఇదంతా గమనిస్తే డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ అంతర్గతంగా అమ్ముడుపోయారా.? అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చైన్ మెన్ శ్రీధర్ అసిస్టెంట్ అని కానీ ఆయన కూడా జీతం ఇచ్చి ఇంకో అసిస్టెంట్ ని పెట్టుకొని ఫీల్డ్ పై పెరగడం చూస్తుంటే అధికారులకు అసలు ఎవరిని ఏ పోస్టులో ఉంచాలో కూడా అవగాహన లేకుండా విధులు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే చైన్ మెన్ శ్రీధర్ ను ఆఫీసులో విధులు నిర్వహించడానికి ట్రాన్స్ఫర్ చేయాలని కోరారు. ఏసీపి క ృష?మోహన్ భారీగా లంచాలు తీసుకుని అక్రమ నిర్మాణాలను, అక్రమ షెడ్లను ప్రోత్సహించి కూల్చివేతలు చేపట్టకపోవడం వల్ల అక్రమ నిర్మాణదారులు మరింత ధైర్యంగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని స్థానికులు తెలిపారని ఆయన అన్నారు. కాప్రా పరిధి చూసే రమేష్ చైన్ మెన్ అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చి లోలోపల సెటిల్మెంట్ చేసుకొని అధికారులకు వాటాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు తప్ప సీజింగ్ చేసే చర్యలు




తీసుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీని వెనుక పెద్ద మొత్తంలో లావాదేవీలు జరిగాయా అన్న అనుమానం వస్తుందని ఆయన అన్నారు.ప్రస్తుతం జీహెచ్ఎంసీ డివిజన్ల విభజన పనిలో అధికారులు నిమగ్నమై ఉండటాన్ని అదనుగా చేసుకొని అక్రమ నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని, పర్యవేక్షణ పూర్తిగా లేకపోవడంతో చైన్ మెన్ లు క్రింది స్థాయి సిబ్బంది అందినకాడికి వసూళ్ల దండుకుంటూ వసూళ్ల రాయుళ్లుగా మారినా చైన్ మెన్ లు పరిమితమవుతున్నారని ఆయన తెలిపారు. నిర్మాణ దశలోనే అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలి లేదా సీజ్ చేయాల్సిన సమయంలో కూడా చర్యలు తీసుకోకపోవడంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం వాటిల్లుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ డిసి,ఎసిపిలు, కింది స్థాయి ఉద్యోగులు వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారని ఆయన అన్నారు. సీజ్ చేసిన భవనాలపై ఉన్న రిబ్బన్లు, ఫ్లెక్సీలు తొలగించి మళ్లీ నిర్మాణాలు కొనసాగిస్తునరాని, దీనిపై ఉన్నతాధికారులు పునరాలోచన చేయాలని స్థానికులు కోరుతున్నారని ఆయన అన్నారు. కేవలం సీజింగ్ చర్యలకే పరిమితం కాకుండా కూల్చివేతలు చేపట్టినప్పుడే అక్రమ నిర్మాణాలకు చెక్ పడుతుందని ఆయన స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలపై జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ నష్టాన్ని నివారించాలని ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారని ఆయన అన్నారు.



## తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు గా సుందర్ కల్లూరి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జర్నలిస్టుల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో ముందుంటానని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గా సుందర్ కల్లూరి పేర్కొన్నారు. ఈనేపథ్యంలో తెలంగాణ ఏర్పడిన తర్వాత పిఆర్వోగా రెండు ప్రభుత్వాలలో పనిచేసిన అనుభవం ఉన్నటువంటి సుందర్ కల్లూరిని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు గా అధ్యక్షుడు ఆనంచిన్ని వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గౌటీ రామకృష్ణ నియమించారు. ఈ సందరరేగా సుందర్ కల్లూరి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికై ఆవితవించినటువంటి తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘనికి రాష్ట్ర ఉపాధ్యక్షులు గా నియమించినటువంటి అధ్యక్షులు ఆనంచిన్ని వెంకటేశ్వరరావు కి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జర్నలిస్టుల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో ముందుంటానని అలాగే జర్నలిస్టుల సంక్షేమానికై అహర్నిశలు కష్టపడతానని, తనకు అప్పగించినటువంటి బాధ్యతకు న్యాయం చేస్తానని తెలిపారు.

## అక్రిడేషన్ కార్డు లలో జాప్యం వద్దు

**- తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎండి సద్దాం డిమాండ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కొత్త అక్రిడేషన్ కార్డులను జారీ చేయడంలో జాప్యం చేయ వద్దని తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎండి సద్దాం హుస్సేన్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా అక్రిడేషన్ కార్డులు జారీ చేయకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీనివాసరెడ్డి పూర్తిగా విఫలం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని యూనియన్ నాయకులతో చర్చలు జరిపి అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని, గతంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టులకు ఇల్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా కొత్త అక్రిడేషన్ కార్డ్ జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని. అక్రిడేషన్ కార్డు జారీ కాగానే ప్రతి ఒక్కరికి 200 గజాల భూమిని ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.






Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588